

నేటినుంచి మోదకొండమ్మ గర్భగుడి మూసివేత

పాడేరురూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): పాడేరు మోదకొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఈ నెల 11వ తేదీ నుంచి నిర్వహించనున్న నేపథ్యంలో మూల విరాట్‌కు రంగులు దిద్దే క్రమంలో ఆదివారం నుంచి ఐదు రోజులపాటు గర్భగుడి మూసివేస్తున్నట్టు ఆలయ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబునాయుడు తెలిపారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు ప్రస్తుతం అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పూజలు చేసుకొనేందుకు అందుబాటులో ఉంచామన్నారు. ఈ విషయాన్ని భక్తులు గమనించి ఆలయ కమిటీకి సహకరించాలని ఆయన కోరారు.

కుమ్మేసిన వాన

ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ

సాయంత్రం జోరువాన

- మాడుగుల, నక్కపల్లిలలో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు
- పాయకరావుపేట, ఎలమంచిలిలో రోడ్లు జలమయం



ఎలమంచిలి కొత్తపేట ప్రధాన రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

అనకాపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి/న్యూస్ నెట్‌వర్క్): **జిల్లాలో పలు చోట్ల శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మాడుగుల మండలం కేజేపురం, వీరవిల్లి అగ్రహారం, ఘాట్‌రోడ్డు జంక్షన్, ఎం.కోడూరు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పలు చోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. నక్కపల్లి మండలంలో కూడా పలు చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.**



మాడుగుల మండలం కేజేపురంలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

జిల్లాలో శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత ఎక్కువగానే ఉంది. ఆ తరువాత ఒక్కసారిగా వాతావరణంలో మార్పు వచ్చింది. సాయంత్రం ఆకాశం మేఘావృతమై వర్షం మొదలైంది. నక్కపల్లి మండలంలో పెనుగాలులు బీభత్సం సృష్టించాయి. నక్కపల్లి మండల కేంద్రంతో పాటు రాజయ్యపేట, ఉపమాక, బోయిపాడు, కాగిత, చినదొడ్డిగల్లు, జానకయ్యపేట, సీహెచ్ఎల్. పురం తదితర గ్రామాల్లో 10 విద్యుత్ స్తంభాలు, 30కి పైగా భారీ వృక్షాలు నేలకొరిగాయి. దీని వల్ల విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎలమంచిలి మండలంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. రేగుపాలెం గ్రామంలోని ముస్లిం కాలనీలో షేక్ మహబూబ్ సుబానీకి చెందిన ఇంటి పోర్టికో కూలిపోయింది. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. చీడికాడ మండలంలోని పలు గ్రామాల్లో సాయంత్రం పిడుగు పడి ఒక పాడిగేదె, పెయ్యి మృతి చెందాయి. చినగోగాడ గ్రామానికి చెందిన కోనేటి సత్యనారాయణకు చెందిన పశువుల పాకల వద్ద పిడుగు పడడంతో ఈ సంఘటన జరిగింది. మాడుగుల మండలంలో శనివారం మధ్యాహ్నం ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. మాడుగుల మోదకొండమ్మ అమ్మవారి ఆలయానికి వెళ్లే దారితో పాటు, విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంతో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఘాట్‌రోడ్డు నుంచి గరికిబంధ వరకు రోడ్డుకు అడ్డంగా చెట్టుకొమ్మలు విరిగి పడడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కోటవురట్ల మండలంలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. దీంతో రహదారులు జలమయమయ్యాయి. గెడ్డలు పొంగి ప్రవహించాయి. పాయకరావుపేటలో భారీ వర్షం కురవడంతో మెయిన్‌రోడ్డులో గౌతమ్ థియేటర్, లక్ష్మి థియేటర్ సెంటర్ తదితర చోట్ల వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. అనకాపల్లి, కశింకోట, మాకవరపాలెం, చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, ఎస్.రాయవరం మండలాల్లో కొద్దిసేపు ఒక మోస్తరు వర్షం పడింది. నర్సీపట్నం, గొలుగొండ, పరవాడ, అచ్యుతాపురం, రాంబిల్లి, మునగపాక, సబ్బవరం, దేవరాపల్లి, కె.కోటపాడులలో తేలికపాటి జల్లులు పడ్డాయి. ఎండకు అల్లాడిన జనం వర్షంతో ఊరట చెందారు.



నక్కపల్లిలో పెనుగాలులకు ఊగుతున్న కొబ్బరి చెట్లు

నేడు నీట్

7,344 మంది అభ్యర్థులు, 16 కేంద్రాలు

- ఇద్దరు ఆర్డీవోలు, ఎనిమిది మంది తహసీల్దార్ల పర్యవేక్షణ
- మధ్యాహ్నం 2 గంటలకు పరీక్ష ప్రారంభం
- గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాల్సిందిగా అధికారుల సూచన
- ఒంటి గంటలకు గేట్లు మూసివేత

విశాఖపట్నం, మే 3 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల్లో బ్యాచిలర్ డిగ్రీ (ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయూష్)లో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న 'నీట్' ఆదివారం నగరంలోని 16 కేంద్రాల్లో జరగనున్నది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో జరగనున్న ఈ ప్రవేశ పరీక్షకు 7,344 మంది హాజరుకానున్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు పరీక్ష ప్రారంభమవుతుంది. అభ్యర్థులను ఉదయం 11 నుంచి కేంద్రాల్లోకి అనుమతిస్తారు. ఒంటి గంట తరువాత గేట్లు మూసివేస్తారు. అంటే గంట ముందే అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. 'నీట్'కు సంబంధించి మల్కాపురం కేంద్రీయ విద్యాలయం ... మిగతా 2వ పేజీలో

డిగ్రీ పరీక్షల షెడ్యూల్‌లో మార్పులు

విశాఖపట్నం, మే 3 ఆంధ్రజ్యోతి): డిగ్రీ రెండు, నాలుగు సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్‌లో మార్పులు చేసినట్టు ఆంధ్ర విశ్వ విద్యాలయం అధికారులు ప్రకటించారు. బీఏ, బీఎస్సీ, బీకాం, బీబీఏ, బీసీఏ, బీహెచ్ఎం విద్యార్థులకు రెగ్యులర్ అండ్ సప్లిమెంటరీ పరీక్షలను ఈ నెల ఆరో తేదీ నుంచి నిర్వ*హించేందుకు తొలుత షెడ్యూల్ విడుదల చేశారు. అయితే, అదే తేదీల్లో కొన్ని ప్రవేశ పరీక్షలు జరగనుండడంతో షెడ్యూల్‌లో మార్పులు చేసినట్టు శనివారం ప్రకటించారు. ఈ నెల ఆరో తేదీ ఉదయం, మధ్యాహ్నం జరగాల్సిన రెండు, నాలుగో సెమిస్టర్ పరీక్షలను ... మిగతా 2వ పేజీలో

సర్వే రాళ్లపై పేరు తొలగింపు



తుది దశకు చేరిన ప్రక్రియ

- గత వైసీపీ ప్రభుత్వంలో జిల్లాలో 475 గ్రామాల్లో వైఎస్ఆర్ జగనన్న రీ సర్వే
- ప్రచార ఆర్భాటం కోసం రూ.కోట్ల నిధులు వృథా
- సర్వే రాళ్లపై జగన్ పేరు, హక్కు పత్రాలపై ఫొటో
- కూటమి ప్రభుత్వం వచ్చాక సర్వే రాళ్లపై పేరు తొలగింపునకు చర్యలు
- రూ.80 లక్షల వరకు వ్యయం



మాకవరపాలెంలో సర్వే రాళ్లపై పేరు చెరిపిస్తున్న అధికారులు

నర్సీపట్నం, మే 3 (ఆంధ్రజ్యోతి): **గత వైసీపీ ప్రభుత్వంలో సర్వే రాళ్లపై వేసిన జగన్ పేరును తొలగించే ప్రక్రియ ఇప్పుడు జిల్లాలో తుది దశకు చేరింది. మొత్తం 5,38,365 సర్వే రాళ్ల మీద జగన్ పేరు తొలగించడానికి రూ.80 లక్షలు ఖర్చు చేస్తున్నారు.**

గత వైసీపీ ప్రభుత్వంలో వైఎస్ఆర్ జగనన్న భూరక్ష -2020 పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా రీ సర్వే చేపట్టింది. నర్సీపట్నం డివిజన్‌లో 357, అనకాపల్లి డివిజన్‌లో 376 గ్రామాలు చొప్పున జిల్లాలోని 24 మండలాలలో 733 గ్రామాలు ఉన్నాయి. గత ప్రభుత్వంలో నర్సీపట్నంలో 208 గ్రామాలు, అనకాపల్లిలో 247 చొప్పున రెండు దశలలో కలిపి 475 గ్రామాల్లో రీ సర్వే చేశారు. భూముల సరిహద్దులకు సర్వే రాళ్ల పాతడానికి గత ప్రభుత్వం రూ.1.58 కోట్లు ఖర్చు చేసింది. కాంట్రాక్టర్‌కి రూ.38 లక్షలు మంజూరు చేసింది. ఇంకా రూ.1.2 కోట్లు బకాయిలు ఉన్నాయి. గత ప్రభుత్వం ప్రచార ఆర్భాటం కోసం సర్వే రాళ్ల మీద వైఎస్ఆర్ జగనన్న భూ రక్ష- 2020 పేరు రాయించారు. సర్వే తరువాత రైతులకు ఇచ్చే హక్కు పత్రాలు మీద జగన్ ఫొటో ముద్రించారు. దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల్లో వ్యతిరేకత వచ్చింది. జగన్ ప్రభుత్వం తీవ్ర విమర్శలకు గురైంది. అయినా జగన్ ఫొటోతో హక్కు పత్రాలు, సర్వే రాళ్ల మీద పేర్లు రాయించడానికి కోట్లు కుమ్మరించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాళ్ల మీద జగన్ పేరు చెరిపించాలని నిర్ణయం తీసుకుంది.



సర్వే రాయిపై పేరు తొలగిస్తున్న దృశ్యం

రీ సర్వే పునఃప్రారంభం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ... మిగతా 2వ పేజీలో

ఆయుర్వేద ఆస్పత్రుల్లో పంచకర్మ చికిత్సలు

ఇప్పటికే ఎస్.రాయవరం మండలం కొరుప్రోలు ఆస్పత్రిలో సేవలు

- అనకాపల్లి, కన్నూరుపాలెం, నర్సీపట్నంలో త్వరలో అందుబాటులోకి చికిత్సలు



అనకాపల్లిలోని ఆయుర్వేద ఆస్పత్రి

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి) **ఆయూష్ మిషన్ వైద్య సేవలను మరింత విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఆయుర్వేద ఆస్పత్రుల్లో పంచకర్మ చికిత్సలను అందుబాటులోకి తేనున్నది. ఇందులో భాగంగా అనకాపల్లి, కశింకోట మండలం కన్నూరుపాలెం, నర్సీపట్నంలోని ఆయుర్వేద ఆస్పత్రుల్లో పంచకర్మ చికిత్సలు అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం నుంచి తాజాగా ఉత్తర్వులు జారీ అయ్యాయి.**

జిల్లాలో ఆయూష్ విభాగంలో 11 ఆయుర్వేద ఆస్పత్రులు, 8 హోమియో వైద్య కేంద్రాలు, నేచురల్ రూరల్ హెల్త్ మిషన్ కేంద్రాలు 7.. మొత్తం 26 ఉన్నాయి. జిల్లాలో అనకాపల్లి, కన్నూరుపాలెం, వేంపాడు, నర్సీపట్నం, ఎం.కోడూరు, కోరుప్రోలు ఆయుర్వేద ఆస్పత్రులను ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లుగా (హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లు)గా అభివృద్ధి చేస్తున్నారు. ఆయా ఆస్పత్రుల ఆవరణలో ఔషధ గుణాలు ఉన్న మొక్కలను పెంచుతున్నారు. ఇప్పటికే ఎస్.రాయవరం మండలం కొరుప్రోలు ఆయుర్వేద ఆస్పత్రిలో పంచకర్మ చికిత్సలు అందిస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధులైన కీళ్లవాత జబ్బులు, సైనోసైటీస్, ఆస్మా వంటి పలు రకాల వ్యాధులకు చికిత్స చేస్తున్నారు. తాజాగా మరో మూడు ఆస్పత్రుల్లో ఈ సేవలను అందుబాటులోకి తేనున్నారు. అనకాపల్లి, కశింకోట మండలం కన్నూరుపాలెం, నర్సీపట్నంలోని ఆయుర్వేద ఆస్పత్రుల్లో త్వరలో ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి. కాగా ఆయూష్ వైద్య సేవలను గ్రామీణ ప్రాంతాలకు విస్తరించేందుకు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కృషి చేస్తున్నామని ఆయూష్ అనకాపల్లి వైద్యాధికారి కె.లావణ్య తెలిపారు.

నిండు ప్రాణాలు తీసిన నిర్లక్ష్యం

సింహగిరిపై ప్రమాదానికి కారణాలు అనేకం

- ఆలయ పరిపాలనలో అనుభవం లేని అధికారికి ఇన్‌చార్జి ఈఓ బాధ్యతలు
- పనులు పూర్తికాని మార్గంలో రూ.300 క్యూలైన్
- డిప్యుటేషన్‌పై వచ్చిన దేవదాయ సిబ్బందికి విధుల కేటాయింపులో వైఫల్యం
- చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్‌ను కార్యాలయానికి పరిమితం చేసిన వైనం



సింహగిరిపై కూలిన గోడ (ఫైల్ ఫొటో)

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి) సింహాచలం చందనోత్సవం రోజున ప్రమాదం జరగడానికి, భక్తులకు భద్రత కల్పించడంలో వైఫల్యం చెందడానికి కారణాలు ఏమిటి?, బాధ్యులు ఎవరు? అనే దానిపై ఇప్పుడు చర్చ జరుగుతోంది. గోడ కూలి ఏడుగురు మరణించిన ఘటనపై త్రిసభ్య కమిటీ ప్రాథమిక విచారణ పూర్తిచేసింది. ఆ కమిటీ కొండపై తొలి రోజు (గురువారం) ఎనిమిది మందిని, రెండో రోజు శుక్రవారం నగరంలోని ప్రభుత్వ అతిథి గృహంలో 11 మందిని విచారించింది. మొత్తం 19 మందిలో 15 మంది వివిధ శాఖల అధికారులు కాగా మిగిలిన నలుగురు ప్రైవేటు వ్యక్తులు. వారిలో వైజాగ్ వలంటీర్స్ అనే స్వచ్ఛంద సంస్థ సభ్యులు కూడా ఉన్నారు. చందనోత్సవంలో ఈ సంస్థ సభ్యులే పెద్ద సంఖ్యలో సేవలు అందించారు.

అనుభవం లేని వ్యక్తికి బాధ్యతలు

ప్రస్తుతం సింహాచలం ఇన్‌చార్జి ఈఓగా వ్యవహరిస్తున్న కె.సుబ్బారావు రెవెన్యూ అధికారి. గత ఏడాది మే నెలలో తొలిసారిగా దేవదాయ శాఖకు డిప్యుటేషన్‌పై వచ్చారు. రాజమండ్రి రీజనల్ జాయింట్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఏడాదికి రూ.50 లక్షల నుంచి రూ.2 కోట్లు ఆదాయం వచ్చే ఆలయాలకు బడ్జెట్ కేటాయింపు, సిబ్బందికి సెలవులు ఇవ్వడం వంటివి ఆయన చూస్తారు. ఆయనకు ఏ ఆలయంలోను ప్రధాన ఉత్సవాలు నిర్వహించిన అనుభవం లేదు. ఆలయ పరిపాలనలో కనీస పరిజ్ఞానం లేదు. అటువంటి అధికారిని తీసుకువచ్చి సింహాచలంలో చందనోత్సవం జరుగుతున్న సమయాన ఇన్‌చార్జి ఈఓగా బాధ్యతలు అప్పగించారు. ఈ ఉత్తర్వులు ఇచ్చింది ఎవరు?, అందుకు కారణాలు ఏమిటి?...అనే దానిపై కమిటీ ఆరా తీసింది.

పనులు పూర్తి కాని మార్గంలో రూ.300 క్యూలైన్

ఉత్సవానికి వచ్చే భక్తుల సంఖ్యను బట్టి ఏర్పాట్లు దేవస్థానం అధికారులే చేయాలి. ఏటా మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ఉచిత, రూ.300, రూ.1,000, రూ.1,500 క్యూలైన్లు ఏర్పాటుచేశారు. అయితే రూ.300 క్యూలైన్ ఏటా జోడుభద్రాలు వద్ద నేరుగా పైకి ఉండే మెట్ల మీదుగా వెళుతుంది. కానీ అక్కడ ఇప్పుడు 'ప్రసాద్' పనులు జరుగుతున్నందున నేరుగా పైకి వెళ్లే అవకాశం లేదు. అందువల్ల దానిని వేరే మార్గంలోకి మళ్లించాల్సి ఉంది. కానీ ఆలయ అధికారులు ఆ పని చేయలేదు. దేవదాయ శాఖ ఇన్‌చార్జి కమిషనర్ రామచంద్రమోహన్, దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులు రూ.300 క్యూలైన్‌ను ... మిగతా 2వ పేజీలో

సొత్తు కోసమే వృద్ధ దంపతుల హత్య

దువ్వాడ జంట హత్యల కేసులో వీడిన మిస్టరీ

- నిందితుడు ఒడిశా వాసి
- మృతురాలితో వివాహేతర సంబంధం
- ఆభరణాల కోసమే ఆమెను చంపాడు
- ఆ దారుణం చూశాడని ఆమె భర్తను హత్య చేశాడు

- వార్త 3వ పేజీలో..

ఆరు రహదారుల అభివృద్ధికి అనుమతులు

- స్పీకర్ అయ్యన్నపాత్రుడు



స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, మే 3 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో రూ.5.3 కోట్లతో చేపట్టబోయే రహదారుల అభివృద్ధి పనులకు పరిపాలన అనుమతులు వచ్చినట్టు స్పీకర్ అయ్యన్నపాత్రుడు శనివారం తెలిపారు. నాతవరం నుంచి గుమ్మిడిగొండకి 4.5 కిలోమీటర్లు, గిడుతూరు నుంచి కైలాసపట్నం వరకు 9.6, చీడిగుమ్మల నుంచి పాకలపాడు మీదుగా పీజీపేట వరకు 5.1, ఏఎల్‌పురం నుంచి కొంకసింగి 3.1, బయపురెడ్డి పాలెం వంతెన నుంచి ఎరకన్నపాలెం వరకు 6.6, వేములపూడి నుంచి కన్నంపేట మీదుగా వెలగలపూడి వరకు 6 కిలోమీటర్ల రహదారులు అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. దీని వలన నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో రవాణా సౌకర్యం మెరుగుపడుతుందన్నారు.

శెట్టిపాలెంలో కాఫీ పౌడర్ తయారీ కేంద్రం

స్థలాన్ని పరిశీలించిన జీసీసీ ఎండీ కల్పనాకుమారి

- ఇక్కడ తయారు చేసిన ఉత్పత్తులు ఇతర రాష్ట్రాలు, విదేశాలకు ఎగుమతి చేస్తామని వెల్లడి



కాఫీ పౌడర్ కేంద్రం ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న జీసీసీ ఎండీ కల్పనాకుమారి

మాకవరపాలెం, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిపాలేనికి కాఫీ పౌడర్ తయారీ కేంద్రం మంజూరైనట్టు ఆంధ్రప్రదేశ్ గిరిజన కార్పొరేషన్ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కల్పనాకుమారి తెలిపారు. ఆ గ్రామంలో శనివారం ఆమె స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన శాఖ ఆధ్వర్యంలో రూ.10 కోట్లతో కాఫీ పౌడర్ తయారీ కేంద్రం పనులు జరుగుతాయన్నారు. దీని వల్ల చాలామందికి ఉపాధి లభిస్తుందని వివరించారు. అయితే శెట్టిపాలెంలో ప్రభుత్వానికి సంబంధించిన భూమి 12 ఎకరాలు మాత్రమే ఉందన్నారు. ఈ భూమిలో ప్రస్తుతం జీడి, మామిడి తోటలు ఉన్నాయన్నారు. ఈ తోటలను తొలగించి ఇక్కడ కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. జాతీయ రహదారికి శెట్టిపాలెం దగ్గరగా ఉండడంతో ఈ ప్రాజెక్టును ఇక్కడ ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. దీని కోసం నలభై అడుగుల రోడ్డును కూడా పరిశీలించామన్నారు. మెయిన్ రోడ్డు నుంచి ఈ యూనిట్ స్థలానికి సుమారు రెండు కిలోమీటర్ల పొడవున రోడ్డు ఏర్పాటు చేస్తామన్నారు. ఇక్కడ తయారు చేసే కాఫీ పొడిని ఇతర రాష్ట్రాలతో పాటు విదేశాలకు ఎగుమతి చేస్తామని తెలిపారు. తర్వలోనే పనులు ప్రారంభించాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఆమె వెంట ఆర్డీవో వీవీ రమణ, పాడేరు ఐటీడీఏ ఈఈ డేవిడ్‌రాజు, సర్పంచ్ అల్లు రామునాయుడు, గిరిజన శాఖ సిబ్బంది ఉన్నారు.

స్పాజ్ కేటగిరీలో జిల్లాకు 3,903 కొత్త పింఛన్లు మంజూరు

▸ డీఆర్‌డీఏ పీడీ శచీదేవి

కోటవురట్ల, మే 3 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా కింద జిల్లాలో స్పౌజ్ కేటగిరీలో 3,903 పింఛన్లు మంజూరైనట్టు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శచీదేవి అన్నారు. శనివారం మండల పరిషత్ సమావేశమందిరంలో మండల స్థాయి అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజల తలసరి ఆదాయం పెంపునకు చర్యలు తీసుకుంటున్నట్టు ఆమె లెఇపారు. రానున్న ఐదేళ్లలో ప్రతి ఒక్కరి తలసరి ఆదాయం పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం విజన్ 2047 ప్రకటించిందన్నారు.ఉద్యానవన, వ్యవసాయ ఉత్పత్తులు పెంపునకు చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలో ఇంతవరకు పక్కా ఇళ్ల నిర్మాణాలపై సమగ్ర నివేదిక తయారు చేయాలని హౌసింగ్ సిబ్బందిని ఆదేశించారు. డాక్టర్ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో మరో పీహెచ్‌సీ ఏర్పాటుకు చేయాలని కోరారు. కొన్ని గ్రామాల్లో హెల్త్‌సెంటర్ల భవనాలు నిర్మించాలన్నారు. ఇరిగేషన్ ఏఈ రాజ్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో తాండవ, దుగ్గాడ సాగునీటి కాలువల ఆధునికీకరణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో కాశీవిశ్వనాథం, టీడీపీ మండల అధ్యక్షుడు జానకి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చదువుపై ఆసక్తి పెంచడానికే వేసవి శిబిరాలు

అచ్యుతాపురం, మే 3 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో విద్యార్థులు చదువుపై ఆసక్తి పెంచడానికే వేసవి శిబిరాలను నిర్వహిస్తున్నామని గ్రంథాలయాధికారి డి. కోటేశ్వరరావు తెలిపారు. శనివారం ఆర్ సింహాద్రినాయుడు ఆధ్వర్యంలో పిల్లలకు పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. పుస్తక పఠనం వల్ల కలిగే లాభాలను ఆయన పిల్లలకు వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఈశిబిరాలకు పంపాలని ఆయన కోరారు.

పుస్తక పఠనంపై విద్యార్థులకు అవగాహన

పాయకరావుపేట, మే 3 (ఆంధ్రజ్యోతి):స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా శనివారం పుస్తక పఠనంపై శిక్షణ ఇచ్చారు. సందర్భంగా రిసోర్స్‌పర్సన్ టి.వెంకటేశ్వర్లు, తాళ్లరావు తదితరులు విద్యార్థులకు పుస్తక పఠనం, ఇంగ్లీషు గ్రామర్, లెక్కలు టిప్స్ చెప్పడంతోపాటు భగవద్గీత శ్లోకాలు చదివించి వాటి అర్థాలను వివరించారు.

నేడు నీట్

... మొదటి పేజీ తరువాయి

ప్రిన్సిపాల్ కో-ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తారు. పరీక్ష నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా జిల్లా యంత్రాంగం పటిష్ఠ ఏర్పాట్లుచేసింది. ప్రతి రెండు కేంద్రాలకు ఒక తహసీల్దార్‌ను ఇన్‌చార్జిగా, ప్రతి ఎనిమిది కేంద్రాలకు ఒక ఆర్డీవోను పర్యవేక్షకునిగా నియమించారు. పరీక్ష నిర్వహణపై జిల్లా ఉన్నతాధికారులు శనివారం సాయంత్రం ఆర్డీవోలు, తహసీల్దార్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేస్తున్నారు. అభ్యర్థులు ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని నిర్వాహకులు కోరారు.

డిగ్రీ పరీక్షల షెడ్యూల్‌లో మార్పులు

... మొదటి పేజీ తరువాయి

ఈ నెల 21న ఉదయం, మధ్యాహ్నం నిర్వహించనున్నారు. ఈ నెల ఏడో తేదీన ఉదయం, మధ్యాహ్నం జరగాల్సిన పరీక్షలను 22న అదే సమయాల్లో నిర్వహిస్తారు. అలాగే, ఈ నెల 19న ఉదయం, మధ్యాహ్నం జరగాల్సిన సెమి స్టర్ పరీక్షలను 23న, 20న ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం జరగాల్సిన రెండు, నాలుగో సెమిస్టర్‌కు సంబంధించిన మూడు పరీక్షలను 24న అదే సమయాల్లో నిర్వహించ నున్నట్టు అధికారులు వెల్లడించారు. ఏయూ అనుబంధ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులు, కాలేజీ యాజమాన్యాలు ఈ విషయాన్ని గుర్తిం చాలని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ టి.చిట్టి బాబు ఒక ప్రకటనలో కోరారు.

సర్వే రాళ్లపై పేరు తొలగింపు

... మొదటి పేజీ తరువాయి

గత ప్రభుత్వంలో జరిగిన తప్పులు సరిదిద్దడానికి గత ప్రభుత్వంలో జరిగిన రీ సర్వే మీద దృష్టి పెట్టింది. గ్రామ సభలు పెట్టి రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరించింది. తరువాత జిల్లాలో మిగిలిన 234 గ్రామాల్లో రీ సర్వే చేయాలని నిర్ణయించి జనవరి 20 నుంచి పనులు ప్రారంభించింది. అదే సందర్భంలో సర్వే రాళ్ల మీద పేర్లు తొలగించడానికి చర్యలు చేపట్టింది. గత ప్రభుత్వం 475 గ్రామాల్లో పాతిన 5,38,365 సర్వే రాళ్లకు గాను ఇప్పటికే 5,17,656 రాళ్ల మీద పేర్లు చెరిపేశారు. దీని కోసం రూ.80 లక్షలు ప్రభుత్వం ఖర్చు చేస్తున్నది.

రాళ్లపై పేర్లు తొలగించాల్సి మండలాలు ఇవే..

జిల్లాలో 24 మండలాలకు గాను 18 మండలాల్లో సర్వే రాళ్ల మీద పేర్లు చెరిపేశారు. ఇంకా రోలుగుంట మండలంలో 2,038, గొలుగొండ 4,303, కశింకోట 6,493, నాతవరం 4,052, మునగపాక 1,253, రాంబిల్లి 647.. మొత్తం 18,786 సర్వే రాళ్ల మీద పేర్లు చెరిపించాల్సి ఉంది.

నిండు ప్రాణాలు తీసిన నిర్లక్ష్యం

... మొదటి పేజీ తరువాయి

అక్కడి నుంచే పక్క మెట్ల మీదుగా మళ్లించారు. ఆ ప్రాంతంలో నిర్మించిన గోడే వర్షానికి కూలిపోయింది. కమిటీ విచారణలో ఇదే విషయం తేటతెల్లమైంది.

విధుల కేటాయింపులో వైఫల్యం

చందనోత్సవంలో సేవలు అందించానికి అటు అమలాపురం నుంచి ఇటు శ్రీకాకుళం వరకు ఉన్న ఆలయాల నుంచి వందలాది మందిని డిప్యుటేషన్‌పై సింహాచలం రప్పించారు. వారంతా చందనోత్సవానికి రెండు రోజుల ముందే ఇక్కడకు చేరుకున్నారు. అందరికీ డ్యూటీ పాయింట్లు వేశారు. అయితే అక్కడ ఎటువంటి విధులు నిర్వహించాలనే దానిపై ఎవరూ మార్గదర్శనం చేయలేదు. ఇలాంటి సందర్భాల్లో ఆలయ ఈఓ, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్, విజయవాడ కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన అధికారులు...ఓ సమావేశం ఏర్పాటు చేసి, ఆయా ఉద్యోగులకు ఎవరు ఏయే పనులు చేయాలో వివరించాలి. గతంలో అలాగే చేసేవారు. కానీ ఈ సారి సమావేశం నిర్వహించలేదు. ఏ పనులు చేయాలో ఎవరికీ చెప్పలేదు. చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ తనకు బాధ్యతలు ఏమీ ఇవ్వలేదని కార్యాలయానికే పరిమితమయ్యారు. కమిషనర్, ఈఓలు ఇద్దరూ ఉత్సవం ముందురోజు ఎవరికీ అందుబాటులో లేరు. దాంతో డిప్యుటేషన్‌పై వచ్చిన వందలాది మంది ఉద్యోగులు వారికి కేటాయించిన ప్రాంతాల్లో దిష్టిబొమ్మల్లా నిల్చోవలసి వచ్చింది. ఇది కూడా ఓ వైఫల్యంగా కమిటీ దృష్టికి వచ్చింది. ఎటువంటి బాధ్యతలు అప్పగించనప్పుడు చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్‌ను ఎందుకు నియమిస్తున్నట్టు? అని కూడా ప్రశ్నించినట్టు సమాచారం.

పెనుగాలుల బీభత్సం

▸ నక్కపల్లి మండలం అతలాకుతలం
▸ నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
▸ పలు గ్రామాల్లో అంధకారం



రాజియ్యపేటలో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

నక్కపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం పెనుగాలులు విధ్వంసాన్ని సృష్టించాయి. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు గంటసేపు తీవ్ర స్థాయిలో పెను గాలులు బీభత్సాన్ని సృష్టించాయి. ఈ పెను గాలులకు నక్కపల్లి మండలం వణికిపోయింది. నక్కపల్లితో సహా రాజియ్యపేట, ఉపమాక, బోయిపాడు, కాగిత, చినదొడ్డిగల్లు, జానకయ్యపేట, సీహెచ్‌ఎల్.పురం తదితర గ్రామాల్లో 10 విద్యుత్ స్తంభాలు, 30కి పైగా భారీ వృక్షాలు నేలకొరిగాయి. దీని కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. జియోతో సహా పలు కంపెనీల నెట్‌వర్కులు పనిచేయకపోవడంతో మొబైల్ ఫోన్లు మూగబోయాయి. దీంతో మొబైల్ ఫోన్ల వినియోగదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

కోటవురట్లలో..

మండలంలోని పలు గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం మూడు గంటల వరకు ఎండ, ఉక్కపోతతో సతమతమైన ప్రజలు ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి ఉపశమనం పొందారు. మండలంలో జల్లూరు, కైలాసపట్నం పందూరు, తంగేడు, లింగాపురం గ్రామాల్లో వర్షం కురిసింది. వేసవిలో సాగుచేస్తున్న పంటలకు ఊపిరి పోసింది. మెట్ట పంటలకు ఈ ఎంతో మేలు చేసిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సుమారు గంటపాటు కుండపోతగా వర్షం కురవడంతో రహదారులు జలమయమయ్యాయి. గెడ్డలు ఉధృతంగా ప్రవహించాయి. సరుగుడు, నువ్వు, కూరగాయాల పంటలకు మేలు చేస్తాయని రైతులు అంటున్నారు. ఈదురు గాలులకు మామిడికాయలు నేలరాలిపోయాయి.



ఎలమంచిలిలో కురుస్తున్న వర్షం

ఎలమంచిలిలో..

పట్టణంలో శనివారం మధ్యాహ్నం అర్ధగంటకు పైగా ఉరుములతో కూడిన వర్షం కురిసింది. దీంతో గంటకు పైగా విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఉదయం నుంచి ఎండ వేడిమితో అల్లాడిపోయిన జనంమధ్యాహ్నం కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. పట్టణంలో పలుచోట్ల రోడ్లపై వర్షం నీరు నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. పలు చోట్ల డ్రైనేజీల్లో పూడికతీయకపోవడంతో వర్షం నీరు నిలిచిపోయింది. డ్రైనేజీల్లో పూడికతీత పనులు చేయించాల్సిన ప్రజారోగ్యశాఖ అధికారులు నెలల తరబడి పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొత్తపేట, మిలట్రీ కాలనీల్లో రోడ్లపై వర్షం నీరు నిలిచిపోవడంతో స్థానికులు, వాహనదారులు తిప్పలు పడ్డారు. డ్రైనేజీల్లో పూడిక తీయించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

కూలిపోయిన ఇంటి పోర్టికో

రేగుపాలెంలోని ముస్లిం కాలనీలో షేక్ మహబూబ్ సుబానీ ఇంటి పోర్టికో కూలిపోయింది. ఈ సమయం లో పోర్టికోలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ఇంటిని సర్పంచ్ మహాలక్ష్మి, సెక్రటరీ రవి సందర్శించారు. అలాగే పట్టణంలో రాజీవ్‌గాంధీ క్రీడా మైదానం వర్షపు నీటితో నిండిపోయింది.

రాంబిల్లిలో..

మండలంలోని పలు గ్రామాల్లో శనివారం చల్లని గాలులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎండ కాసింది. మధ్యాహ్నం 3 గంటలు ప్రాంతంలో ఆకాశం మేఘామృతమై వాతావరణం చల్లబడి అరగంట సేపు వర్షం కురిసింది. ఈ వర్షం దుక్కులకు, అపరాలు పంటలకు, కొబ్బరి తోటలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు.

రోడ్డుపైనే నిలిచిన వర్షపు నీరు

పాయకరావుపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మెయిన్‌రోడ్డును పునర్నిర్మించిన అధికారులు ఇరువైపులా ఆక్రమణలు తొలగించి కాలువలు ఏర్పాటు చేయకపోవడంతో చిన్న వర్షం వచ్చినా రోడ్డుపైనే నీరు నిలిచిపోతోంది. శనివారం మధ్యాహ్నం పడిన వర్షానికి మెయిన్‌రోడ్డుపై పలుచోట్ల వర్షపునీరు రోడ్డుపై నిలిచిపోయి చెరువులను తలపించడంతో వాహనచోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రెండేళ్ల క్రితం మెయిన్‌రోడ్డును పునర్మించిన అధికారులు ఇరువైపులా ఆక్రమణలు తొలగించి కాలువలు ఏర్పాటు చేయలేదు. దీంతో యజమానులు తమ షాపుల ఎదుట ఎత్తు చేసుకోవడంతో ఏమాత్రం వర్షం పడినా నీరు బయటకుపోయే మార్గం లేక మెయిన్‌రోడ్డుపై ప్రవహిస్తుండగా.. పలు లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచిపోయి చెరువులను తలపిస్తోంది. శనివారం మధ్యాహ్నం అర్ధగంటపాటు పడిన భారీ వర్షానికి మెయిన్‌రోడ్డులో గౌతమ్ థియేటర్, లక్ష్మి థియేటర్ సెంటర్, తదితర చోట్ల రోడ్డుపై వర్షపునీరు నిలిలిచిపోయి చెరువులను తలపించడంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇదిలా ఉంటే లక్ష్మి థియేటర్ వద్ద ఖాళీ స్థల యజమాని తన స్థలం ఎదుట అడుగు ఎత్తు చేయడంతో ఆ సెంటర్‌లో వర్షపు నీరు నిలిచిపోయింది. వర్షం తగ్గిన తర్వాత గంటల తరబడి నీరు ఉండడంతో నీటిలో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మెయిన్‌రోడ్డుపై వర్షపు నీరు నిలిచి ఉన్నచోట్ల గోతులు ఏర్పడి పాడయిపోయే ప్రమాదం ఉంది. మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



కోటవురట్లలో వర్షానికి జలమయమైన మెయిన్‌రోడ్డు



పాయకరావుపేటలోని లక్ష్మి థియేటర్ ఎదుట చెరువును తలపిస్తున్న మెయిన్‌రోడ్డు

సారా, బెల్ట్‌షాపులపై సభ్యుల మండిపాటు

▸ వాడీవేడిగా నక్కపల్లి మండల సమావేశం

నక్కపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ రత్నం అధ్యక్షతన శనివారం వాడీవేడిగా సాగింది. గత సమావేశంలో తీర్మానాలను ఎంపీడీఓ సీతారామరాజు వివరించారు. ఆ తరువాత కాసేపటికి అనారోగ్యం కారణంగా ఎంపీపీ ఇంటికి వెళ్లిపోయారు. వైస్ ఎంపీపీ వీసం నానాజీ అధ్యక్షతన శాఖలవారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సమయంలో ఎక్సైజ్ ఎస్ఐ వీఎల్.ప్రశాంతి మాట్లాడుతూ నాటుసారా నివారణ కోసం విస్తృతంగా ప్రచారం చేస్తున్నామన్నారు. దీనిపై స్పందించిన ఆకేటి గోవిందావు, కంచే మధు, వాసుపల్లి అప్పలస్వామి, మేరుగు రాజేశ్వరరావు ఎక్సైజ్ శాఖ సిబ్బందిపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అనేక



ఎక్సైజ్‌శాఖ అధికారిని నిలదీస్తున్న ఆకేటి గోవిందరావు

గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులు ఏర్పాటు చేశారని, మరికొన్ని చోట్ల బెల్టు షాపుల కోసం వేలం పాటలు నిర్వహించారని మండిపడ్డారు. పలు గ్రామాల్లో భారీ స్థాయిలో నాటుసారా తయారవు తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని అసహనం వ్యక్తం చేశారు. ఎక్సైజ్‌శాఖ సిబ్బంది పనితీరుతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తహసీల్దారు స్పందిస్తూ ఇకపై సారా, బెల్టు షాపులపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. నక్కపల్లి ఆసుపత్రికి రాత్రి వేళల్లో వెళ్లే రోగులకు సకాలంలో వైద్య సేవలు అందడంలేదని, ఆసుపత్రిలో కిందిస్థాయి సిబ్బంది వ్యవహారశైలి బాగాలేదని ఎంపీటీసీ సభ్యుడు బచ్చల రాజు ఆరోపించారు. అనం తరం ఎంపీడీఓకి ఫిర్యాదు చేశారు. భవిష్యత్‌లో ఇటువంటివి జరక్కుండా చర్యలు తీసుకుంటామని సూప రింటెండెంట్ శిరీషా హామీ ఇచ్చారు. వ్యవసాయ శాఖ అందజేసే రాయితీలను ఏఓ ఉమాప్రసాద్ తెలియజేశారు. ప్రత్యేకాధికారి ప్రసాద్, జడ్పీటీసీ సభ్యురాలు కాసులమ్మ, వైస్‌ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, సర్పంచులు రెడ్డి వరహాలు, ప్రగడ వీరబాబు, నేతల జయరత్నకుమారి పాల్గొన్నారు.

బార్క్ కాలనీకి అదనపు భూ సేకరణ

▸ రైతులతో చర్చించిన ఆర్డీవో ఆయిషా

అచ్యుతాపురం, మే 3 (ఆంధ్రజ్యోతి): బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ (బార్క్) కాలనీ కోసం అదనపు భూసేకరణ చేసేందుకు అనకాపల్లి ఆర్డీవో ఆయిషా శనివారం దొప్పెర్ల రైతులతో చర్చించారు. బార్క్ కోసం ఇక్కడ 2200 ఎకరాల్లో నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి. ఉద్యోగుల కాలనీ కోసం భూసేకరణ గతంలో చేశారు. జిరాయితీ భూములకు పరిహారం ఇచ్చేశారు. అనాదీనం, డీ పట్టా సాగుదారులకు ఇంకా పరిహారం ఇవ్వలేదు. అయితే ఈకాలనీ నిర్మాణానికి మరింత భూమి అవసరం వచ్చింది. దీంతో గతంలో సేకరించిన భూమి పక్కనే గల జిరాయితీ భూములను సేకరించాలని అధికారులు నిర్ణయించారు. సర్వే నంబర్లు 157, 158, 161, 162, 163లలో 13 ఎకరాలు సేకరించాలని నిర్ణయించారు. దీంతో ఆయా సర్వే నంబర్లలో భూములున్న రైతులతో శుక్రవారం దొప్పెర్లలో సమావేశం ఏర్పాటుచేసి రైతుల అభిప్రాయాలను సేకరించారు. ఆమోదయోగ్యమైన పరిహారం ఇస్తే భూములు ఇవ్వడానికి సిద్ధమని దొప్పెర్ల రైతులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ వరహాలు, ఎంపీటీసీ సభ్యుడు పల్లి వెంకటరావు, కొల్లి వరహాలరావు పల్లి శేషగిరిరావు, కొల్లి సన్నిబాబు పాల్గొన్నారు.



రైతులతో చర్చిస్తున్న ఆర్డీవో ఆయిషా

కుట్టు శిక్షణలో నైపుణ్యం సాధించాలి : ఎమ్మెల్యే సుందరపు

మునగపాక, మే 3 (ఆంధ్రజ్యోతి): కుట్టు శిక్షణలో మహిళలు నైపుణ్యం సాధించాలని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన ఉచిత కుటు శిక్షణ కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుటుంబ ఉన్నతి మహిళలు చేతుల్లోనే ఉందని, వారిని అన్ని విధాలుగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. ఎంపీడీవో ఎం.ఉషారాణి మాట్లాడుతూ మండలం వ్యాప్తంగా 99 మంది మహిళలను కుట్టుశిక్షణకు ఎంపిక చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన మండల అధ్యక్షులు దొడ్డి శ్రీనివాసరావు, టెక్కలి పరశురాం, కూటమి నాయకులు దాడి ముసిలినాయుడు, మొల్లేటి సత్యనారాయణ, బద్దెం సూర్యనారాయణ, ఏవీ.సత్యనారాయణ, ఆడారి శ్రీకాంత్, ఆడారి గణేష్, నాయకులు పాల్గొన్నారు.

అప్పలనాయుడును పరామర్శించిన ఎమ్మెల్యే

రోడ్డు ప్రమాదంలో ఇటీవల తీవ్రంగా గాయపడిన జనసేన పార్టీ నాయకుడు బొడ్డేడ అప్పలనాయుడును ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ శనివారం స్వగృహంలో పరామర్శించారు. అప్పలనాయుడు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

సుందరపును కలిసిన కోన తాతారావు

ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌ను డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఉన్న ఎమ్మెల్యే విజయకుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో తాతారావు సత్కరించారు. అనంతరం ప్రభుత్వ పాలనపై మాట్లాడుకున్నారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు టెక్కలి పరశురాం, జనసైనికులు పాల్గొన్నారు.



మునగపాకలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

ఎలమంచిలిలో హత్య చేసి.. చేబ్రోలులో పడేశారు..

▸ భార్య సహా ముగ్గురి అరెస్టు

గొల్లప్రోలు, మే 3 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భావించిన భార్య తన ప్రియుడు, స్నేహితుడితో కలిసి భర్తను హత్య చేసి మృతదేహాన్ని జిల్లా దాటించి 75 కిలోమీటర్ల దూరంలో పడవేశారు. కానీ, మృతుడి తల్లి ఫిర్యాదు, సాంకేతికత అంశాల ఆధారంగా పోలీసుల దర్యాప్తుతో విషయం వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించి భార్యతో సహా ముగ్గురిని అరెస్టు చేసినట్లు కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. గొల్లప్రోలు పోలీస్‌స్టేషన్‌లో కాకినాడ ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాకినాడ జిల్లా పరిధిలోని కత్తిపూడి-కాకినాడ మధ్యగల 216వ జాతీయ రహదారిపై గొల్లప్రోలు మండలం చేబ్రోలు బైపాస్‌రోడ్డులో మార్చి 3న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. చేబ్రోలు వీఆర్వో ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేసి ఎస్పీ, ఏఎస్పీ ఆధ్వర్యంలో పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, సర్కిల్ ఎస్ఐలు, పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. రాష్ట్రంతోపాటు సరిహద్దు రాష్ట్రాల మిస్సింగ్ కేసులు, జాతీయ రహదారిపై సీసీ కెమేరాలు, టోల్‌ప్లాజాలవద్ద సీసీ ఫుటేజీలు, సెల్‌టవర్ ఆధారంగా విచారణ సాగించారు. ఇదే సమయంలో అనకాపల్లి జిల్లా ఎలమంచిలి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏప్రిల్ 28న తన కుమారుడు రెండు నెలలుగా కనిపించడం లేదని తల్లి చేసిన ఫిర్యాదుపై మిస్సింగ్ కేసు నమోదైంది. దీనిపై పరిశీలన జరపగా మృతదేహం ఎలమంచిలి పట్టణం ధర్మవరం ప్రాంతానికి చెందిన తంగిళ్ల లోవరాజుగా గుర్తించారు. లోవరాజు భార్యకు భర్త బంధువైన మాడెం మోహన్‌కుమార్‌తో వివాహేతర సంబంధం ఉంది. దీన్ని కొనసాగించడానికి భర్త అడ్డంకిగా ఉన్నాడని వారిద్దరూ భావించారు. దీంతో మోహనకుమార్, అతడి స్నేహితుడు బల్లా గంగాధరరావు కలిసి ఫిబ్రవరి 28వ తేదీ రాత్రి లోవరాజును హత్య చేసి చేబ్రోలు హైవే పక్కన పడవేశారు. 75కిలోమీటర్ల దూరంలో జిల్లాను దాటి మృతదేహాన్ని ఇక్కడ పడవేయడం, రెండు నెలల వ్యవధిలో తమపై ఎవరికీ అనుమానం రాలేదని నిందితులు భావించారు. దీంతో మృతుడి తల్లి ఎలమంచిలి పోలీసులను ఆశ్రయించింది. దీని ఆధారంగా దర్యాప్తు జరపడంతో కేసు కొలిక్కి వచ్చినట్లు కాకినాడ జిల్లా ఎస్పీ వివరించారు. భార్య, ఆమె ప్రియుడు, స్నేహితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు తెలిపారు.

వైసీపీ జిల్లా విస్తృత సమావేశం రేపు : బొడ్డేడ

మునగపాక, మే 3 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లిలో ఈ నెల 5వ తేదీన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరగనుందని వైసీపీ అరకు పార్లమెంటు నియోజకవర్గం పరిశీలకుడు బొడ్డేడ ప్రసాద్ పిలుపు నిచ్చారు. శనివారం ప్రసాద్ క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాలు అమల్లో ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. ఏడాదిలోనే ప్రజలు నుంచి అసంతృప్తి మొదలైందని, ఇటువంటి సమయంలో వైసీపీ శ్రేణులు ప్రజల పక్షాన నిలవాలన్నారు. అనంతరం ప్రసాద్‌ను పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు సూరిశెట్టి రాము, మద్దాల వీరునాయుడు, సర్పంచులు కాండ్రేగుల నూకరాజు, దిమ్మల అప్పారావు, బీశెట్టి గంగఅప్పలనాయుడు, బొడ్డేడ శ్రీను, సుందరపు తాతాజీ, చదరం నాయుడుపాల్గొన్నారు.

ఉపాధి కార్మికులకు చీరల పంపిణీ

మునగపాక, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాడ్రాపల్లిలో 250 మంది ఉపాధి కార్మికులకు అదే గ్రామానికి చెందిన జనసేన నాయకుడు కొయిలాడ దశావతారం దంపతులు శనివారం చీరలను పంపిణీ చేశారు. అదేవిధంగా గౌరీ సంక్షేమ సంఘానికి రూ.60 వేలు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు దొడ్డి శ్రీను, టెక్కలి పరశురాం, ఏవీ.సత్యనారాయణ, ఆడారి శ్రీకాంత్, మళ్ల శేషు, కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు క్రాఫ్ట్,డ్రాయింగ్‌లో శిక్షణ

రాంబిల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి) : పిల్లల్లో సృజనాత్మకతను వెలికి తీయడంలో క్రాఫ్ట్, డ్రాయింగ్ కీలకపాత్ర వహిస్తాయని జ్ఞానవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మారిశెట్టి వెంకట అప్పారావు అన్నారు. అనకాపల్లి చిల్డ్రన్స్ క్లబ్ వారు అప్పారాయుడుపాలెంలో ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌కు శనివారం ప్రముఖ క్రాఫ్ట్ అండ్ ఆర్ట్ ఉపాధ్యాయురాలు కమండూరు జోతిర్మయి హాజరై పిల్లలకు కలర్స్ పేపర్లపై క్రాఫ్ట్, ఆర్ట్ బొమ్మలు గీయడం నేర్పించారు.

జనవాణి ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పరిశీలన

మునగపాక, మే 3 (ఆంధ్రజ్యోతి): జనవాణి ఫిర్యాదులపై క్షేత్రస్థాయి పరిశీలన చేసినట్టు ఇరిగేషన్ డీఈ సాయి ప్రశాంతి తెలిపారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో గత నెల 9వ తేదీన నిర్వహించిన జనవాణిలో మునగపాకలో అనకాపల్లి ఆవకాలువపై నిబంధనలకు విరుద్ధంగా బ్రిడ్జీ నిర్మాణం జరుగుతుందని చేసిన ఫిర్యాదుపై దర్యాప్తు చేశామన్నారు. పరిస్థితిని తహసీల్దార్‌కు లిఖితపూర్వకంగా ఇచ్చామన్నారు.

ఇంటిపై కూలిన చెట్టు తొలగింపు

ఎలమంచిలి, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగుపాలెంలో శుక్రవారం ఓ ఇంటిపై కూలిన కొబ్బరి చెట్టును శనివారం పంచాయతీ సర్పంచ్ మహాలక్ష్మి, గ్రామ సెక్రటరీ దగ్గరుండి చెట్టును తొలగించారు. పంచాయతీకి చెందిన చెట్టు కూలడంతో ఇంటికి నష్టం వాటిల్లింది. ఈ చెట్టును తొలగించాలని ఇంటి యజమాని గతంలో పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీనిపై శనివారం 'ఆంధ్రజ్యోతి'లో వార్త రావడంతో అధికారులు స్పందించి కొబ్బరిచెట్టును తొలగించారు.

స్వచ్ఛాంధ్ర సాకారానికి సహకరించాలి

▸ మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు



ఎలమంచిలిలో స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న కమిషనర్ ప్రసాదరాజు

ఎలమంచిలి, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి పట్టణ ప్రజలు సహకరించాలని ఎలమంచిలి మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు కోరారు. శనివారం రామ్మూర్తి నగర్, ద్వారకానగర్, రెహబోతు చర్చి ప్రాంతాల్లో మునిసిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, ఇంటింటికి తిరిగి ప్రజలకు స్వచ్ఛాంధ్రపై అవగాహన కల్పించి, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, ఏఈ గణపతి సుబ్బారావు పాల్గొన్నారు.

గూడుపమ్మను దర్శించుకున్న కర్రి ఆంజనేయులు

నక్కపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేబాక గూడుపమ్మ క్షేత్రాన్ని శనివారం మధ్యాహ్నం ఎలమంచిలి బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కర్రి ఆంజనేయులు దర్శించుకున్నారు. ఆలయంలో గోత్రనామాలతో పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త గొట్టుముక్కల శ్రీహరిరాజు ఆధ్వర్యంలో అమ్మవారి శేషవస్త్రంతో ఆంజనేయులను సత్కరించారు.


అక్రమంగా నిల్వ చేసిన డీజిల్ స్వాధీనం

అచ్యుతాపురం, మే 3 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం-గాజువాక ప్రధాన రహదారిలో నారపాక వద్ద అక్రమంగా నిల్వ చేసిన 396 లీటర్ల డీజిల్‌ని స్వాధీనం చేసుకున్నామని సీఐ నమ్మి గణేష్ తెలిపారు. మునగపాక మండలం నాగవరానికి చెందిన అప్పికొండ వెంకటేష్ ట్యాంకర్ల డ్రైవర్ల ద్వారా డీజిల్‌ని తక్కువ ధరకు కొనుగోలు చేసి నిల్వ చేస్తున్నట్టు సమాచారం రావడంతో నిఘా పెట్టామన్నారు. ప్రతి రోజు మాదిరిగా శనివారం ఉదయం ఎనిమిది గంటలకు ఆయిల్ ట్యాంకర్ కంఠంరెడ్డి శ్రీనివాసరావు నుంచి డీజిల్ కొనుగోలు చేస్తుండగా తాము పట్టుకున్నామని తెలిపారు. వెంకటేష్‌తో పాటు శ్రీనివాసరావుని అదుపులోకి తీసుకున్నామన్నారు. కాగా ఈ వ్యాపారం గత రెండునెలలుగా జరుగుతోందని తెలిసింది. సెజ్‌లోని ఐఓసీ నుంచి ట్యాంకర్ల ద్వారా వస్తున్న డీజిల్‌ని తక్కువ ధరకు కొనుగోలు చేసి లీటర్ రూ. 85కి విక్రయిస్తున్నారు.

కార్మిక చట్టాలపై అవగాహన

ఎస్.రాయవరం, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడ్డరోడ్డులోని జీడి పిక్కల పరిశ్రమతోపాటు పలు దాబాలను శనివారం ఎలమంచిలి మండల న్యాయ సేవా అధికార సంస్థ కమిటీ సభ్యులు సందర్శించి, అక్కడ పనిచేస్తున్న కార్మికులకు న్యాయ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కార్మికులు పని చేసేచోట వారికి కలిపించే మౌలిక సదుపాయాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కోర్టు ప్యానల్ లాయర్‌లు తిన్నావా, నూకరాజు, బాబు, వీఆర్‌వో గోపి, తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి మృతి చెందిన వ్యక్తి గుర్తింపు



మొల్లి తాతబాబు(ఫైల్)

పాయకరావుపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పీఎల్.పురం రైల్వే గేటు వద్ద శుక్రవారం రైలు నుంచి జారిపడి మృతిచెందిన వ్యక్తి పశ్చిమగోదావరి జిల్లా వాసిగా గుర్తించినట్టు తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ జి.శ్రీనివాసరావు శనివారం తెలిపారు. మృతదేహం వద్ద లభ్యమైన సెల్‌ఫోన్ కాల్స్ ఆధారంగా మృతుడు పశ్చిమగోదావరి జిల్లా అత్తిలి మండలం పల్లి గ్రామానికి చెందిన మొల్లి తాతబాబు (27)గా గుర్తించామన్నారు. మృతుడికి తల్లిదండ్రులు, అక్క, అన్నయ్య ఉన్నారని, ఆయనకు 47 రోజుల క్రితమే వివాహం అయ్యిందన్నారు. అయితే తన భార్యకి చెందిన దుస్తులు తెచ్చేందుకు అత్తగారి ఇల్లు అనకాపల్లి జిల్లా చీడికాడ మండలం చుక్కపల్లి గ్రామానికి వెళుతూ ప్రమాదవశాత్తూ రైలు నుంచి జారిపడి మృతి చెందినట్టు చెప్పారు. తుని ఏరియా ఆసుపత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, మృతుడి బంధువులకు అప్పగించడం జరిగిందని తుని ప్రభుత్వ రైల్వే స్టేషన్ ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ బోధన

▸ విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయుల వినూత్న ప్రయత్నం

▸ ఈ ఏడాది టెన్త్‌లో ఉత్తీర్ణులైన వారితో గ్రామాల్లో విస్తృత ప్రచారం



మామిడిపాలెంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

తుమ్మపాల, మే 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ బోధన అందిస్తున్నట్టు యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి, మామిడి పాలెం జడ్పీహెచ్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు హెచ్‌బీ శ్రీధర్ అన్నారు. మామిడిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో కలిసి మామిడిపాలెం, మాకవరం, సంతపాలెం గ్రామాల్లో శనివారం ర్యాలీ నిర్వహించారు. మామిడిపాలెం పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు 27 మంది 500కు పైగా మార్కులు పొందారని చినబ్బాయి తెలిపారు. అలాగే శత శాతం ఉత్తీర్ణత సాధించామని వివరించారు. హెచ్‌ఎం శ్రీధర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి, ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వసంతరావు, బాబు, కరుణజ్యోతి, సుబ్రహ్మణ్యం, దయాసాగర్, గౌరి, ఆచార్యులు, పట్టాభి, శ్రీను, పార్థు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా కోటా మూడు శాతం పెంపుపై హర్షం



సమావేశంలో పాల్గొన్న జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : క్రీడా కోటా మూడు శాతం పెంపు హర్షణీయమని వ్యాయామ ఉపాధ్యాయులు పేర్కొన్నారు. అనకాపల్లిలో శనివారం ఏర్పాటైన సమావేశంలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చిరికి వెంకటరావు, కేఎం నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో డీఎస్సీ ఉపాధ్యాయుల భర్తీలో క్రీడల కోటాను మూడు శాతం పెంచడం గొప్ప విషయమన్నారు. క్రీడాకారులు, క్రీడాభిమానుల మూడు దశాబ్దాల కోరిక ఎట్టకేలకు నెరవేరిందని ఆనందం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో జరగబోయే అన్ని నియామకాల్లో మూడు శాతం క్రీడా కోటాను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రవేశ పరీక్షల ఫలితాలతో నిమిత్తం లేకుండా క్రీడల్లో ప్రతిభ ఆధారంగా నేరుగా ఉద్యోగ నియామకాలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మోటూరు నాగేశ్వరరావు, ఎస్.శ్రీనివాసరావు, పీవీ నాయుడు, డి.శ్యామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై సమన్వయ కమిటీ చర్చ



ప్రజల సమస్యలు వింటున్న మండల ప్రత్యేకాధికారిణి లక్ష్మీసుభాషిణి

కశింకోట, మే 3 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో సమస్యల పరిష్కారమే మండల సమన్వయ కమిటీ సమావేశాల లక్ష్యం కావాలని మండల ప్రత్యేకాధికారిణి వి.లక్ష్మీసుభాషిణి అన్నారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఏర్పాటైన ఈ సమావేశంలో మాట్లాడారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ కుమారస్వామి మాట్లాడుతూ కశింకోట నుంచి ఒకటి, ఉగ్గినపాలెం నుంచి రెండు భూ సమస్యలపై ఫిర్యాదులు అందినట్టు చెప్పారు. కశింకోట సర్వే నంబరు 122/1లో గోడ నిర్మాణం చేస్తుంటే పలువురు అభ్యంతరం తెలుపుతున్న అంశంపై పరిశీలన జరుపుతున్నామన్నారు. ఉగ్గినపాలెంలో ఇంటి సందు విషయమై ఫిర్యాదు అందిందని, పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. సర్వే నంబరు 23లో ఉన్న లబ్ధిదారుని భూమికి సర్వే జరగకుండా అడ్డుకుంటున్న విషయమై ఫిర్యాదు అందడంతో వచ్చే వారం పూర్తి పత్రాలతో హాజరు కావాలని సూచించినట్టు చెప్పారు. ఎంపీడీవో వి.వి.రమణ, స్టేషన్ రైటర్ సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ పాలనలో దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రం'

తుమ్మపాల, మే 3 (ఆంధ్రజ్యోతి) : దేశంలో నిరుద్యోగ సమస్య రోజు రోజుకి తీవ్రమవుతోందని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వియ్యపురాజు అన్నారు. ఇక్కడి సీపీఐ కార్యాలయం వద్ద ఏఐవైఎఫ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని శనివారం నిర్వహించి మాట్లాడారు. దశాబ్ద కాలంగా బీజేపీ ప్రభుత్వం నిరుద్యోగులకు మొండిచేయి చూపిస్తుందన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టిన తరువాత 42 శాతం నిరుద్యోగ సమస్య పెరిగిందని ఆరోపించారు. అలాగే రాష్ట్రంలో కూటమి అధికారం చేపట్టి ఏడాది కావస్తున్నా నిరుద్యోగుల సమస్యలపై దృష్టి సారించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య ప్రతినిధులు శ్రావణి, దివ్య, లావణ్య, కీర్తన, అపర్ణ, నాయుడు, శ్రీనివాస్, సురేష్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ

పరవాడ, మే 3 (ఆంధ్రజ్యోతి) : ముత్యాలమ్మపాలెంలో ఈ నెల 20న ముత్యాలమ్మ జాతర జరగనుంది. ఇందుకు సంబంధించిన పోస్టర్లను జనసేన పార్టీ మండల ఇన్‌చార్జి పంచకర్ల ప్రసాద్ శనివారం స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతకాయల ముత్యాలు, రావాడ సర్పంచ్ మోటూరి సన్యాసినాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న, జనసేన మండల అధ్య క్షుడు బొద్దపు శ్రీనివాస్‌కాసులు, పూజారి చింతకాయల ముత్యాలు, దాసుడు, దినేశ్, మైలపల్లి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో హిజ్రా మృతి!

కొయ్యూరు, మే 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని డౌనూరు ప్రాథమిక వైద్య కేంద్రం ఆవరణలో అనకాపల్లి జిల్లా జోగంపేటలోని ఎస్సీ కాలనీకి చెందిన కుమారస్వామి అలియాస్ ఆకాంక్ష (25) అనే హిజ్రా అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉంది. శుక్రవారం అర్ధరాత్రి దాటాక ఈ ఘటన చోటు చేసుకుంది. శనివారం ఉదయం విధుల్లో ఉన్న సిబ్బంది గుర్తించారు. ఈ ఘటనపై స్థానికులు, సహచర హిజ్రాలు, కుటుంబీకులు, పీహెచ్‌సీ సిబ్బంది అందించిన వివరాలివి. జోగంపేటకు చెందిన పులి వెంకన్న, కొండమ్మ దంపతులకు చెందిన ఆ కాంక్ష సుమారు ఎనిమిదేళ్ల కిందట నర్సీపట్నానికి చెందిన హిజ్రాల వద్దకు చేరింది. తరచూ మండలంలోని డౌనూరు, మర్రిపాలెం గ్రామాలకు వచ్చి వ్యవసాయ పనుల్లో సాయం చేసి వచ్చిన డబ్బుతో మద్యం సేవించేది. గురువారం రాత్రి మర్రిపాలేనికి చెందిన కిముడు కొండమ్మ ఇంటికి వెళ్లింది. అనంతరం జ్వరంగా ఉందంటూ అక్కడే నిద్రించింది. శుక్రవారం ఉదయం డౌనూరు పీహెచ్‌సీకి వెళ్లాలని సూచిస్తూ కొండమ్మ ఆమెకు రూ.30 ఇచ్చింది. దీంతో మధ్యాహ్నం 12 గంటల సమయంలో కడుపు నొప్పికి వైద్య సేవలు పొందింది. అనంతరం కొండమ్మ ఇంటికి వెళ్లకుండా నాటుసారా సేవించి గ్రామంలో తిరిగినట్టు సమాచారం. అర్ధరాత్రి దాటాక సీహెచ్‌సీ ఆవరణలో సిమెంట్ బల్లపై మృతి చెంది ఉంది. ఈవిషయాన్ని తెలుసుకున్న కొయ్యూరు సీఐ వెంకటరమణ, ఎస్ఐ కిశోర్ వర్మ శనివారం ఉదయం సంఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి తోటి హిజ్రాలను, పీహెచ్‌సీ సిబ్బందిని విచారించారు. మృతురాలు అన్న దారబాబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాతృ మరణ కారకులను ఉపేక్షించొద్దు

▸ అటువంటి ప్రైవేటు ఆసుపత్రులపై చర్యలు తీసుకోండి ▸ అర్హతలు లేకుండా వైద్యం చేస్తున్న వారిని గుర్తించండి

▸ మాతృ మరణాలకు కారణమైన విశాఖలోని సూర్య ఆసుపత్రి, ఆరాధ్య సంతాన సాఫల్య కేంద్రంపై కేసులు పెట్టండి

▸ జిల్లాస్థాయి కమిటీ సమీక్షా సమావేశంలో కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం



మాతా శిశు మరణాలపై జిల్లాస్థాయి కమిటీ సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణ

అనకాపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి) : నిర్లక్ష్యంగా వ్యవహరించి మాతృ మరణాలకు కారణమవుతున్న ప్రైవేటు ఆసుపత్రులపై కేసులు నమోదు చేయాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. ఇక్కడి కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం మాతా శిశు మరణాలపై జిల్లాస్థాయి కమిటీ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె జిల్లాలో గత మూడు నెలల్లో సంభవించిన నాలుగు మాతృ మరణాలకు, 29 శిశు మరణాలకు గల కారణాలను కేసుల వారీగా వివరాలు తెలుసుకున్నారు. సరైన వైద్యం అందించకుండా చివరి క్షణంలో ప్రభుత్వ ఆసుపత్రులకు రిఫర్ చేస్తూ, మరణాలకు కారణమయ్యే ప్రైవేటు ఆసుపత్రులపై కఠినంగా వ్యవహరించాలని వైద్య, ఆరోగ్య శాఖాధికారులను ఆమె ఆదేశించారు. అర్హతలు లేకుండా ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం చేస్తున్న వారిని గుర్తించి, చర్యలు చేపట్టాలన్నారు. బాధ్యతారహిత్యంగా వ్యవహరించి, మాతృ మరణాలకు కారణమైన విశాఖలోని ఎంవీపీ కాలనీలో గల సూర్య ఆసుపత్రి, విశాఖపట్నంలోని ఆరాధ్య సంతాన సాఫల్య కేంద్రంపై కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించారు. గ్రామాల్లో సక్రమంగా వైద్య సేవలు అందించకుండా మాతృ మరణాలకు కారణమవుతున్న వైద్య సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ ఎం.శాంతిప్రభ, డీసీహెచ్‌ఎస్ శ్రీనివాసరావు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఈదురు గాలులతో భారీ వర్షం

▸ లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన నీరు

▸ పిడుగుపడి అనకాపల్లి మండలం వెంకుపాలెంలో గేదె మృతి



తాళ్లపాలెంలోని సోమవరం సంత వద్ద నిలిచిపోయిన వర్షపునీరు

కశింకోట/కొత్తూరు, మే 3 (ఆంధ్రజ్యోతి) : వాతావరణంలో మార్పుల కారణంగా కశింకోట, అనకాపల్లి మండలాల్లో శనివారం ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. దీంతో అంతటా ఒక్కసారిగా చల్లబడింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత కొనసాగింది. ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరయ్యారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై, ఈదురు గాలులతో వర్షం పడడంతో అంతా ఉపశమనం పొందారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. తాళ్లపాలెం నుంచి నర్సీపట్నం వెళ్లే రోడ్డులో వర్షపు నీరు చెరువును తలపించింది. ఇదిలావుంటే, పిడుగుపాటుకు అనకాపల్లి మండలం వెంకుపాలెంలో పాడి గేదె మృతి చెందింది. ఈదురు గాలులతో వర్షం కురుస్తున్న సమయంలో బుద్ద రాము అనే రైతు చేనుల వద్ద పెద్ద శబ్దాలతో పిడుగు పడడంతో పాడి గేదె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ కారణంగా రూ.85 వేలు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

పెదముషిడివాడ టీడీపీ కార్యవర్గం ఎన్నిక

పరవాడ, మే 3 (ఆంధ్రజ్యోతి) : పెదముషిడివాడ గ్రామ టీడీపీ కార్యవర్గం ఏర్పాటైంది. ఎంపీటీసీ ఒమ్మి వెంకటరావు, పిల్లా అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధ్యక్షుడిగా ఒమ్మి అప్పారావు, ఉపాధ్యక్షులుగా సాలాపు ధనరాజు, బోని రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా నారపిన్ని సంతోష్ కుమార్, కోశాధికారిగా డీఆర్ఎల్ నరసింహం ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా పి.కనకరాజు, ఇసరపు రాజు, బంధం భాస్కర్, వడ్డాది గణేశ్, పల్లా గణేశ్ లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్సి అప్పారావు, బంధం వెంకటరమణ, రావాడ నాయుడు, వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

మధురానగర్‌లో ముమ్మరంగా పారిశుధ్య పనులు

తుమ్మపాల, మే 3 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ తుమ్మపాల మధురానగర్‌లో పారిశుధ్య పనులను శనివారం ముమ్మరంగా చేపట్టారు. ఇటీవల ఇక్కడి సమస్యపై 'మురికి కూపంలా మధురానగర్' శీర్షికన 'ఆంధ్ర జ్యోతి' కథనాన్ని ప్రచురించింది. దీనిపై స్పందించిన పం చాయతీ అధికారులు ప్రత్యేకంగా పారిశుధ్య సిబ్బందిని

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఏర్పాటు చేసి వీధులన్నీ శుభ్రం చేయించారు. పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని ట్రాక్టర్ల ద్వారా తరలించారు. అలాగే డ్రైన్లలో పూడికను తొలగించి మురుగు ప్రవహించేలా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ ఈవో ఈశ్వరరావు మాట్లాడుతూ తుమ్మపాలలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్టు చెప్పారు.



మధురానగర్‌లో శుభ్రం చేసిన ఓ వీధి

కొనసాగుతున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమ్మె

అనకాపల్లి టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను పరిష్కరించి, ఉద్యోగ భద్రత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ వీవీ శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలపై చేపట్టిన సమ్మె శనివారం రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఇక్కడి నెహ్రూచౌక్ వద్ద ధర్నా చేస్తున్న వీరికి సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఆరేళ్లు దాటిన ప్రతి సీహెచ్‌వోను క్రమబద్ధీకరించాలన్నారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఏటా ఐదు శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని, ఈపీఎఫ్‌వోను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

హమ్మయ్యా.. బస్సులన్నీ వచ్చేశాయ్..

▸ గత రెండు రోజులుగా ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు

▸ కొన్ని అమరావతి పీఎం సభకు వెళ్లగా.. సిబ్బంది ఆందోళనతో నిలిచిన అద్దె బస్సులు



అనకాపల్లి టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు అనకాపల్లి ఆర్టీసీ డిపో బస్సులు శనివారం ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చాయి. డిపోలోని 95 బస్సులకు 42 అద్దె బస్సులు కాగా, 53 డిపోకు చెందినవి. ఈ 53 బస్సుల్లో 25 బస్సులు అమరావతిలో శుక్రవారం జరిగే ప్రధానమంత్రి మోదీ కార్యక్రమానికి గురువారం ఉదయం కార్యకర్తలను తరలించేందుకు వెళ్లిపోయాయి. శుక్రవారం ఆర్టీసీ అద్దెబస్సుల కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 40 బస్సులను నిలిపివేశారు. దీంతో డిపోలో ఉన్న 28 బస్సులు మాత్రమే ప్రయాణికులకు అందుబాటులో ఉండేవి. ఫలితంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చాలా మంది ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు. ఇది గుర్తించిన సంస్థ అధికారులు ఇతర డిపోల నుంచి మరో 15 బస్సులను అందుబాటులోకి తీసుకువచ్చినా ప్రయాణికులు బస్సుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి తప్పలేదు. అమరావతికి వెళ్లిన బస్సులు శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు వస్తూనే ఉన్నాయి. అద్దె బస్సుల డ్రైవర్లు శుక్రవారం రాత్రి సమ్మె విరమించారు. దీంతో డిపోలోని అన్ని బస్సులు అందుబాటులోకి వచ్చాయి. ఫలితంగా ప్రయాణికులకు అవస్థలు తప్పాయి. ముందు ఇటువంటి పరిస్థితులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రయాణికులు కోరుతున్నారు.

సొత్తు కోసమే వృద్ధ దంపతుల హత్య

విశాఖపట్నం, మే 3 (ఆంధ్రజ్యోతి) : దువ్వాడ సమీపాన గల రాజీవ్ కాలనీలో వారం కిందట జరిగిన వృద్ధ దంపతుల హత్య కేసుని పోలీసులు ఛేదించారు. మహిళ మెడలోని ఆభరణాలను దొంగిలించేందుకు ఆమెతో సన్నిహిత సంబంధం కలిగిన వ్యక్తే హత్యకు పాల్పడినట్టు నిర్ధారించారు. నిందితుడి నుంచి రెండు సెల్‌ఫోన్‌లు, రూ.4.18 లక్షల నగదు, హత్యకు వాడిన కత్తిని పోలీసులు స్వాధీనం చచేసుకున్నారు. నగర పోలీస్ కమిషనరేట్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో సీపీ శంఖబ్రతబాగ్చి దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. గంపల యోగేంద్ర బాబు (66), ఆయన భార్య లక్ష్మి (58) కలిసి దువ్వాడలోని రాజీవ్‌కాలనీలో సొంత ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఒడిశా రాష్ట్రం పూరీకి చెందిన ప్రసన్నకుమార్‌మిశ్రా (58) కూడా వారి ఇంటికి సమీపంలోనే నివాసం ఉండేవాడు. పక్కపక్క ఇళ్లు కావడంతో ప్రసన్నకుమార్‌మిశ్రా భార్య, గంపల లక్ష్మి స్నేహంగా ఉండేవారు. కొవిడ్ సమయంలో ప్రసన్నకుమార్‌మిశ్రా భార్య మరణించడంతో అతను ఇల్లు ఖాళీ చేసి ద్వారకా నగర్ ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని ఒక డార్మెటరీలో ఉంటున్నాడు. రాజీవ్ కాలనీలో ఉన్నప్పుడే ప్రసన్నకుమార్‌మిశ్రాకు గంపల లక్ష్మితో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఆ సంబంధం కొనసాగిస్తూ వచ్చారు. ప్రసన్నకుమార్ మిశ్రాకు ఆర్థిక ఇబ్బందుల కారణంగా అప్పులు చేసేశాడు. వాటిని తీర్చేందుకు ఆభరణాలు ఇవ్వాల్సిందిగా లక్ష్మిని కోరగా, ఆమె నిరాకరించింది. దీంతో ఆమెను చంపేసి ఆభరణాలను తీసుకు వెళ్లాలని ప్రసన్నకుమార్‌మిశ్రా పథకం రచించాడు. గత నెల 24న గాజువాకలోని ఒక సూపర్‌మార్కెట్‌కు వెళ్లి కత్తి కొనుగోలుచేసి నేరుగా లక్ష్మి ఇంటికి వెళ్లాడు. బంగారం ఇవ్వాలని మరోసారి అడిగాడు. ఆమె ససేమిరా అనడంతో మెడను కత్తితో కోసి హత్య చేశాడు. ఆమె మెడలోని ఆభరణాలను తెంచుకుని వెళ్లిపోతుండగా, మరో గదిలో ఉన్న లక్ష్మి భర్త యోగేంద్రబాబు రావడంతో ఆయన్ను కూడా హత్యచేశాడు. అనంతరం యోగేంద్రబాబుకు చెందిన స్కూటీపై వెళ్లిపోయాడు. హత్య చేసిన తర్వాత డైమండ్ పార్కు సమీపంలోని సాయిరాం డార్మెటరీకి వెళ్లి రెండు గంటలు ఉన్నాడు. అక్కడి నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లి స్కూటీని పార్కింగ్‌లో వదిలేసి, విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో భువనేశ్వర్, అక్కడి నుంచి పూరీ వెళ్లిపోయాడు. చోరీచేసిన బంగారు ఆభరణాలను అక్కడ తన సోదరి చేతికి ఇచ్చి అమ్మి తనకు డబ్బులు తేవాలని కోరాడు. ఆమె బంగారం దుకాణానికి వెళ్లి ఆభరణాలను కరిగించి రూ.4.28 లక్షలకు విక్రయించింది. ఆ సొమ్మును తన సోదరుడైన ప్రసన్నకుమార్‌మిశ్రాకు ఇచ్చింది. ఈ హత్య కేసు దర్యాప్తులో భాగంగా మృతురాలు లక్ష్మి సెల్‌ఫోన్‌ను పోలీసులు పరిశీలించారు. కాల్ డేటాను తీశారు. కొన్ని నంబర్లు ఆమె డిలీట్ చేసినట్టు గుర్తించారు. ఓ నంబర్ గల వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా, గతనెల 21న తాను దువ్వాడ మాక్స్ షోరూమ్ వద్ద ఉండగా సుమారు 56 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి వచ్చి కాగితంపై రాసుకున్న నంబర్‌కు తన ఫోన్ నుంచి కాల్ చేసినట్టు చెప్పారు. అక్కడవున్న సీసీ కెమెరాలను పరిశీలించగా ప్రసన్నకుమార్‌మిశ్రా ఫోన్ మాట్లాడినట్టు నమోదైంది. ఆ ఫొటోను దువ్వాడ ప్రాంతంలో పలువురికి చూపించగా ప్రసన్నకుమార్‌మిశ్రాగా, అతనిస్వస్థలం ఒడిశా అని నిర్ధారించడంతోపాటు వారివద్ద ఉన్న ఫోన్ నంబర్‌ను ఇచ్చారు. ఆ ఫోన్ నంబర్ రాణిశర్మ అనే మహిళ పేరుతో ఉన్నట్టు గుర్తించారు. కాల్ చేస్తే స్విచ్ ఆఫ్ అని రావడంతో సీపీ శంఖబ్రతబాగ్చి ఆదేశాల మేరకు సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ ఆధ్వర్యంలో 15 మంది సీఐలు, వంద మంది సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఒడిశాలో ఉన్న ప్రసన్నకుమార్‌మిశ్రాను గుర్తించి అదుపులోకి తీసుకున్నాయి. మొదట తాను ఇద్దరినీ హత్య చేయలేదని చెప్పాడు. గంపల లక్ష్మికి తనతో వివాహేతర సంబంధం ఉందని తెలిసి ఆమె భర్త యోగేంద్రబాబు హత్య చేస్తే, తాను యోగేంద్రబాబును హత్య చేసినట్టు చెప్పాడు. తర్వాత పోలీసులు తమదైన శైలిలో విచారించడంతో సొత్తుకోసం లక్ష్మిని తాను హత్యచేసి వెళ్లిపోతుండగా యోగేంద్రబాబు చూడడంతో ఆయన్ను కూడా హత్యచేసినట్టు అంగీకరించాడు. నిందితుడు గతంలో యూఏఈలో ఉన్నప్పుడు చోరీకి పాల్పడి, ఐదేళ్లు జైలుశిక్ష అనుభవించాడని, విడుదలైన తర్వాత ఇండియాకు వచ్చి విశాఖలో నివాసం ఉంటున్నాడని సీపీ వివరించారు. ఈ సమావేశంలో డీసీపీలు అజితా వేజెండ్ల, మేరీప్రశాంతి, లతామాధురి, ఏసీపీలు త్రినాథరావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గంటాను కలిసిన డీసీఎంఎస్ చైర్మన్ బాలాజీ



బాలాజీని సత్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా

అనకాపల్లి టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును డీసీఎంఎస్ చైర్మన్‌గా నియమితులైన కోట్ని బాలాజీ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖ నగరంలోని ఎంవీపీ కాలనీలో నివాసం ఉంటున్న ఆయన స్వగృహానికి వెళ్లి బొకేను అందజేశారు. అనంతరం గంటా శాలువాతో బాలాజీని సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఐసీఎస్ఈ ఫలితాల్లో 'గుడ్‌షెపర్డ్' విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత



ఉత్తమ విద్యార్థినిని అభినందిస్తున్న కరస్పాండెంట్ పాల్

అనకాపల్లి టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : ఐసీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో ఇక్కడి గుడ్‌షెపర్డ్ స్కూల్ విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించారని కరస్పాండెంట్ పాల్ తెలిపారు. తమ స్కూల్ నుంచి 26 మంది విద్యార్థులకు పరీక్షలకు హాజరుకాగా, అందరూ ఉత్తీర్ణులయ్యారన్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన మామిడి ప్రణవీని ఆయన అభినందించి సత్కరించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమష్టి కృషి వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

సబ్బవరం, మే 3 (ఆంధ్రజ్యోతి) : బంగారమ్మపాలెంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్టు సర్పంచ్ దాడి లావణ్య ఒక ప్రకటనలో తెలిపారు. అమృత ఆసుపత్రి, వాసన్ కంటి ఆసుపత్రి సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరం ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం రెండు గంటల వరకు వైద్య నిపుణుల పర్యవేక్షణలో కొనసాగుతుందని వివరించారు. బంగారమ్మపాలెంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆమె కోరారు.

నేటి నుంచి మోదకొండమ్మ పండగ


మోదకొండమ్మ తల్లి

హుకుంపేట మే 3 ఆంధ్రజ్యోతి: మండల కేంద్రంలో మోదకొండమ్మ తల్లి "పండగ" ఆదివారం నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పాంగి అనిల్ తెలిపారు. మూడు రోజులు నిర్వహించనున్న ఈ పండగకు భారీ ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా సదుపాయాలు కల్పించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కాసులమ్మ పూర్ణిమ, రామకృష్ణ, నాగు, నూకన్న,గోవింద్ శివ, తదితరులు ఉన్నారు.

ఎలుగు దాడిలో గాయపడిన గిరిజనుడికి పరామర్శ

అనంతగిరి, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మకోట పంచాయతీ బురదగెడ్డ గ్రామానికి చెందిన తమల జానకీరావు శుక్రవారం ఎలుగుబంటిదాడిలో గాయపడి ఎస్‌కోట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ సబ్ డీఎఫ్‌వో ఉమామహేశ్వరి, ఇన్‌చార్జీ రేంజర్ రాజాబాబుతో కలిసి జానకీరావును ఆస్పత్రికి వెళ్లి శనివారం ఉదయం పరామర్శించారు. ఎలుగుబంటి దాడిపై వివరాలను అడిగితెలుసుకున్నారు.. అనంతరం అధికారులు కొంతవరకు ఆర్థికసాయమందించారు. ఎఫ్ఎస్‌వో పాపారావు, ఎఫ్‌బీవో సత్యనారాయణ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కొయ్యూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో కృష్ణాదేవిపేట- చింతపల్లి మార్గంలోని నడింపాలెం వలువ వద్ద శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరిగి తీవ్ర గాయాలయ్యాయి. బైక్‌పై వెళ్తున్న అంకంపాలెం గ్రామానికి చెందిన తూబెరి ఏసుబాబును పాటపెదవలస నుంచి కృష్ణాదేవిపేట వెళుతున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో ఏసుబాబు కుడికాలితోపాటు పలు చోట్ల బలమైన దెబ్బలు తగిలాయి. అతనిని అదే కారులో నర్సీపట్నం తరలించారు.

మతి స్థిమితంలేని వృద్ధురాలి మృతి

చింతపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాజంగి జలాశయం సమీపంలో మతి స్థిమితంలేని వృద్ధురాలు మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం కిటుముల పంచాయతీ బౌడ గ్రామానికి చెందిన వనుము పార్వతమ్మ(60) 15 ఏళ్లుగా మతిస్థిమితం కోల్పోయింది. ఆమె వారం రోజులుగా ఆమె గృహాన్ని విడిచి వెళ్లిపోయింది. శనివారం జలాశయం సమీపంలో ఆమె మృతదేహం లభించింది. ఈఘటనపై పోలీసులు విచారణ చేపడుతున్నారు.

చెట్టును ఢీకొన్న బైక్: ఒకరి మృతి

డుంబ్రిగుడ, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కురిడి రైల్వే ట్రాక్ సమీపంలో అరకు- పాడేరు రహదారిలో చెట్టును ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందారు. దీనికి సంబంధించి స్థానిక ఎస్‌ఐ పాపినాయుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గసబ పంచాయతీ లోగిలి గ్రామానికి చెందిన గిరిజనుడు కొర్రా నాగేశ్వరరావు(38) ఈ నెల 1న బంధువుల ఇంటికి వంతలచింతలకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో ఈనెల 2 స్టేషన్‌లో కుటుంబీకులు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో భాగంగా బాధితుడి సెల్ ఫోన్ లోకేషన్ ఆధారంగా కురిడిలోని రైల్వే ట్రాక్ సమీపంలో మృతదేహాన్ని వెలికి తీశామన్నారు. కుటుంబీకులకు సమాచారం అందించగా మృతదేహం నాగేశ్వరరావుదేనని గుర్తించారని ఆయన తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ పాపినాయుడు తెలిపారు.

'లేటరైట్ తవ్వకాలను అడ్డుకుంటాం'

గూడెంకొత్తవీధి, మే 3 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో లేటరైట్ తవ్వకాలను అడ్డుకుంటామని భారతీయ ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు అన్నారు. శనివారం ప్రజాభిప్రాయ సేకరణ గ్రామ సభ వద్దకు చింతపల్లి జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, వివిధ సంఘాల నాయకులతో కలిసి ఆయన వచ్చారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మైనింగ్ తవ్వకాల వల్ల ఆదివాసీ రైతులు తాత్కాలికంగా లాభపడినా భవిష్యత్తు తరాలకు భారీ నష్టం జరుగుతుందన్నారు. డోకులూరు లేటరైట్ తవ్వకాలను అడ్డుకుంటామన్నారు. ఈకార్యక్రమంలో జనసేన నాయకుడు గొర్లె వీరవెంకట్, సిద్ధార్థ్ మార్క్, టీడీపీ నాయకుడు కొర్ర బలరామ్ పాల్గొన్నారు.

ఈదురు గాలుల బీభత్సం

కొయ్యూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మిక పంచాయతీలో శనివారం మధ్యాహ్నం ఈదురుగాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. మండలంలో వర్షం కురిసినా, కొమ్మిక ప్రాంతంలో దీని ప్రభావం అధికంగా ఉంది. ఇళ్ల పైకప్పు రేకులు ఎగిరి భారీ నష్టాన్ని చేకూర్చాయి. శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎండ కాసింది. అనంతరం ఆకాశం మేఘావృతమై ఈదురు గాలలతో కూడిన వర్షం ప్రారంభమైంది. కొమ్మిక, కొత్త బొర్రంపేట గ్రామాలకు చెందిన మర్రి అప్పారావు, బాబూరావు, శంకర్‌లకు చెందిన ఇళ్ల పైకప్పు రేకులు ఎగిరి పోవటంతో గృహోపకరణాలు, తిండి గింజలు ఎలక్ట్రికల్ సామగ్రి తడిసి ముద్దయ్యాయి. విద్యుత్ సరపరాకు అంతరాయం ఏర్పడింది.


పాడేరులో రోడ్డుపై వంటలు చేస్తున్న నాయకులు


అరకులోయలో నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే మత్స్యలింగం కాంగ్రెస్ నేతలు

రెండో రోజు మన్యం బంద్ ప్రశాంతం

- పాడేరులో మూతపడ్డ దుకాణాలు
- నిలిచిన ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు

పాడేరురూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతానికి ప్రత్యేక డీఎస్సీ, జీవో 3ను పునరుద్ధరించాలనే డిమాండ్లతో చేపట్టిన మన్యం బంద్ రెండవ రోజు శనివారమూ విజయవంతమైంది. జిల్లా కేంద్రం పాడేరులో ఉదయం 5 గంటల కు అరకు ఎంపీ డాక్టర్. గుమ్మా తనూజారాణి, అరకు మాజీ ఎమ్మెల్యే చెట్టి పా ల్గుణ, స్థానిక ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజులతోపాటు పలుసంఘ నాయకులు, విద్యార్థి సంఘాలు ఆర్టీసీ కాంప్లెక్స్ కు చేరుకుని డిపో నుంచి బస్సు లను బయటకు రానీయకుండా అ డ్డుకున్నారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నేత పి.అప్పలనర్స మాట్లాడుతూ గిరిజన ప్రాంత సమస్యలపై ప్రభుత్వం స్పందించి పరిష్కరించేంత వరకు పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. ఎంపీ తనూజారాణి మాట్లాడుతూ జీవో 3 పునరుద్ధరించేంత వరకు ఈ ఆందోళనకు వైసీపీ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ఆందోళనకారులు వంటావార్పు చేపట్టి రోడ్లపైనే భోజనాలు చేశారు. దీంతో రాకపోకలు స్తంభించారు. త లారిసింగి జంక్షన్ సమీపంలో బంద్ నిర్వాహకులు జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో, సబ్‌కలెక్టర్, ట్రైనీకలెక్టర్ల వాహనాలను సైతం అ డ్డగించారు. పరిసర మండలాల్లో విధులకు వెళ్లే పోలీసులను సైతం అడ్డగిం చారు. పట్టణంలో వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసి రెండో రోజు కూడా బంద్‌కు సహకరించారు. బ్యాంక్‌లు, పెట్రోల్ బంక్‌లు మూతపడ్డాయి. సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలను ఆందోళకారులు మూయించారు. ప్రైవేటు వాహనదారులు బంద్‌కు సహకరించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు కుడుముల కాంతారావు, ఆర్.జగన్మోహన్‌రావు, పల్లుల ప్రసాద్, సత్యారావు, ఎస్.మాణిక్యం, కె.సురేంద్ర, ఎల్.సుందరరావు, ఎస్.బాలదేవ్, బి.చిన్నయ్యపడాల్, కూడా రాధాకృష్ణ, చిన్ని, పార్వతమ్మ, వై.కుమార్, పి.వెంకట శేషాద్రి, ప్రజాబంద్ పార్టీ నాయకులు, వివిధ గ్రామాల ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

కొయ్యూరు: ఆదివాసీ గిరిజన సంఘం, స్పెషల్ డీఎస్సీ పోరాట కమిటీ ఆధ్వర్యంలో మూలపేట పంచాయతీ మర్రిపాలెం కూడలిలో రాస్తారోకో నిర్వహించి వాహన రాక పోకలు అడ్డుకున్నారు. వ్యాపార సంస్థలు మూయించారు. జాతీయ రహదారిపై బైఠాయించారు. కొయ్యూరు సీఐ వెంకటరమణ, ఎస్‌ఐ కిశోర్‌వర్మ సిబ్బంది ఆందోళన విరమించాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరికలు జారీ చేశారు. దగ్గరుండి వ్యాపార సంస్థలు తీయించారు. దీంతో ఆందోళన కారులు నిరసనను విరమించారు.

చింతపల్లి: మండలంలో రెండోవ రోజు బంద్ ప్రశాంతంగా ముగిసింది. శనివారం మండల కేంద్రంతోపాటూ పలు గ్రామాల్లో యథావిధిగా దుకాణాలు తెరిచారు. ఉదయం పది గంటలకు దండకారణ్య విమోచన సమితి నాయకులు మండల కేంద్రంలో ప్రతి దుకాణాలను మూయించివేశారు. ఆర్టీసీ బస్సులు, సర్వీసులు వాహనాలు నామమాత్రంగా తిరిగాయి. ఇతర గ్రామాల్లో బంద్ ప్రభావం పెద్దగా కనిపించలేదు. హనుమాన్ జంక్షన్‌లో విమోచన సమితి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. నాయకులు కుడుముల శేఖర్, భారతి, మోనిక, కాసులమ్మ, వెంకయమ్మ, చంద్రకళ, మాజీ ఎంపీపీ వంతల బాబూరావు, వైసీపీ నేత జల్లి సుధాకర్ పాల్గొన్నారు.

జీకేవీధిలో బంద్ ప్రభావం నిల్

గూడెంకొత్తవీధి: మండలంలో శనివారం బంద్ ప్రభావం కనిపించలేదు. మండల కేంద్రంతోపాటూ పలు గ్రామాల్లో దుకాణాలు యధావిధిగా తెరుచుకున్నాయి. వాహనాలు తిరిగాయి. సాయంత్రం ఆర్టీసీ బస్సులు వచ్చాయి.

జి.మాడుగుల: మండల కేంద్రంతో పాటు బొయితిలిలో ప్రజా సంఘాల నాయకులు వంటా వార్పు తదితర నిరసన కార్యక్రమాలు న్వహించారు. ప్రత్యేక డీఎస్సీ కమిటీ మండల కన్వీనర్ ఎం.నారాయణరాజు, నాయకులు ధర్మనపడాల్, జి.శేఖర్, జి. సన్యాసిదొర ఎస్.సోమలింగం, వి.రమణ, ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: కించుమండలో బంద్ మండంలో రెండవ రోజు కూడా జరిగింది. ఈ సందర్భంగా నిరుద్యోగ యువత, గిరిజనులు రోడ్డుపై బైఠాయించి అర్ధనగ్న ప్రదర్శన చేశారు. అరకు, డుంబ్రిగుడ, కించుమండ మారుమూల గ్రామాల్లో సైతం దుకాణాలు స్వచ్ఛందంగా మూతపడ్డాయి.

హుకుంపేట; గిరిజన సంఘం, నిరుద్యోగులు శనివారం అమ్మ వారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిరుద్యోగులకు న్యాయం జరగాలని మొక్కారు. హుకుంపేటలో శనివారం సంత బంద్ నేపథ్యంలో వ్యాపారులు, గిరిజనులు రాక వెలవెలపోయింది. గ్రామాల్లో జీవో 3 పునరుద్ధరించాలని నిరసన కార్య క్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొండలరావు, గిరిజన సంఘ జిల్లా అధ్యక్షులు హైమవతి, నాయకులు టి. కృష్ణారావు వైసీపీ నాయకులు రవి ప్రసాద్ ,సత్యం, నైని సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ: వైసీపీ పిలుపు మేరకు మన్యం బంద్ శనివారం రెండో రోజు కొనసాగింది. ఈసందర్భంగా అరకులోయలో దుకాణాలు, పర్యాటక కేంద్రాలు మూతపడ్డాయి. ఆర్టీసీ, ఇతర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో జనాలు ఇబ్బందులు పాలయ్యారు. దుకాణాల మూసివేశారు. ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం , పెదలబుడు ఎంపీటీసీ సభ్యుడు దురియా ఆనంద్, మాజీ సర్పంచ్‌లు చిన్నారావు, ప్రకాశరావు, వైసీపీ నాయకులు కృష్ణారావు, సింహాచలం, శెట్టి అప్పాలు, బాలు, కాంగ్రెస్ నాయకురాలు పాచిపెంట శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు. వీరంతా పట్టణంలో ర్యాలీ చేపట్టి ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ ప్రకటించాలని, జీవో 3 కు ప్రత్యామ్నాయ చట్టం అమలు చేయాలని నినాదాలు చేశారు.

అనంతగిరి:స్పెషల్ డీఎస్సీపై వైసీపీ రెండోరోజు చేపట్టిన బంద్ మండలంలోని పాక్షికంగా సాగింది.. కాశీపట్నం వద్ద ఎంపీపీ శెట్టి నీలవేణి, మండల పార్టీ అధ్యక్షుడు కొర్రా సూర్యనారాయణ తదితరులు రోడ్డుపై బైఠాయించారు. దీంతో కొంతసేపు వరకు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ఎంపీటీసీ మితుల, సర్పంచ్లు పాగి అప్పారావు, మజ్జి అప్పారావు, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు : స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ ఆధ్వర్యంలో స్థానిక నాలుగు రోడ్ల కూడలిపై వంటా వార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. రోడ్డుపై భోజనాలు చేసి తమ నిరసనను తెలిపారు. మండల కేంద్రంలో వారపు సంత రద్దయింది. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ఎం.ఎం.శ్రీను, కె.త్రినాథ్, వి.సుభాష్, నాగభూషణ్, బాబూరావు, శ్రీనివాసమూర్తి, ధర్మారావు, పద్మారావు, దామోదరం తదితరులు పాల్గొన్నారు.


ముంచంగిపుట్టులో రోడ్డుపై భోజనాలు చేస్తున్న నాయకులు


కొయ్యూరు: మర్రిపాలెం కూడలిలో రోడ్డుపై బైఠాయించిన దృశ్యం

చింతపల్లి ఆస్పత్రిలో గైనికాలజిస్టు నియామకం


విధుల్లో చేరిన వాసవి

చింతపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రి గైనికాలజిస్టుగా ఎస్. వాసవిని డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ అధికారులు నియమించారు. ఆస్పత్రిలో ఉన్న మూడు గైనికాలజిస్టు పోస్టుల్లో ఒకరు మాత్రమే ఉన్నారు. ఆమె కూడా ప్రస్తుతం ప్రసూతి సెలవులో ఉన్నారు. మిగిలిన రెండు పోస్టులు ఖాళీగావున్నాయి. దీంతో గైనికాలజిస్టు అందుబాటులోలేక మైదాన ప్రాంతాల నుంచి రెండు రోజులకు ఒక గైనికాలజిస్టు డిప్యూటేషన్‌పై ఇక్కడకు వచ్చి గర్భిణులకు వైద్యసేవలందిస్తున్నారు. తాజా నియామకాల్లో ఈ పోస్టును అధికారులు భర్తీ చేశారు. ఈ మేరకు వాసవి శనివారం విధుల్లో చేరారు. ఈసందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ గర్భిణులకు మెరుగైన వైద్యసేవలందించేందుకు కృషి చేస్తానన్నారు.

డిగ్రీ కళాశాల ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన

చింతపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ.1.4కోట్ల ఉపాధి హామీ పథకం నిధులతో ప్రహరీ నిర్మాణానికి జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి శనివారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రహరీలేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈనేపథ్యంలో గ్రంథాలయ అధికారి జగ్గత్‌రాయ్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడంతో నిధులు మంజూరు చేశారన్నారు. ఈకార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు నాజర్‌వల్లి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసపాత్రుడు, అధ్యాపకులు లీలాపావని పాల్గొన్నారు.

ఆస్పత్రిలో ప్రసవం శ్రేయస్కరం

చింతపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు ఆస్పత్రిలోనే ప్రసవం పొందాలని నక్కపల్లి సామాజిక ఆరోగ్య కేంద్రం స్త్రీవైద్యనిపుణులు ఎ. జయలక్ష్మి అన్నారు. శనివారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో గర్భిణులకు ప్రత్యేక ఆరోగ్య తనిఖీలు, అల్ట్రాసౌండ్ స్కానింగ్‌లు నిర్వహించారు. గర్భిణులకు కౌన్సెలింగ్ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భందాల్చిన నాటి నుంచి ప్రసవం పొందే వరకు గర్భిణులు క్రమంగా ఆరోగ్య తనిఖీలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.ఇందిరా ప్రియాంక పాల్గొన్నారు.

'జీవో 3పై వైసీపీ నేతలకు మాట్లాడే హక్కులేదు'

అరకులోయ, మే 3 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆపార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు జీవో -3 ని పునరుద్ధరణ, ఆదివాసీ స్పెషల్ డీఎస్సీని ప్రకటించకుండా కాలక్షేపం చేసి నేడు కూటమి ప్రభుత్వ అధికారంలోకి రాగానే ఈ సమస్యలపై ధర్నాలు, బంద్‌లు చేపట్టడం సమంజసంగా లేదని టీడీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ నాయకుడు,పెదలబుడు మేజర్ సర్పంచ్ పెట్టెలి దాసుబాబు మండిపడ్డారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, వైసీపీ అధికారంలో ఉండగా సుప్రీంకోర్టు జీవో 3 రద్దు చేసిందని, అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం కనీసం రివ్యూపిటిషన్ వేసి పునరుద్ధరణకు చర్యలు తీసుకోలేదని విమర్శించారు. దీనిపై ఆపార్టీ ఎమ్యెల్యేలు,ఎంపీలు, నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. స్పెషల్ డీఎస్సీ, జీవో 3పై బంద్‌కు పిలుపు నివ్వడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టుందని ఎద్దేవా చేశారు. జీవో 3 స్థానంలో ప్రత్యామ్నాయ చర్యలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవ తీసుకుంటారని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు త్రినాథ్, చందు, సత్యనారాయణ,నాగరాజు,, మోహన్‌దాస్ , లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

గిరిజన మంత్రి ప్రకటన హర్షణీయం


పాడేరురూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): జీవో 3కు బదులు ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకువస్తున్నట్టు ప్రభుత్వం తరుపున జిల్లా ఇన్‌చార్జి మంత్రి హోదాలో గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి చేసిన ప్రకటన హర్షణీయమని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు పాంగి రాజారావు అన్నారు. గిరిజనుల హక్కుల అమలులో కూటమి ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. వైసీపీ పాలనలో సుప్రీం కోర్టులో జీవో 3పై వాదనలు జరిగితే కనీసం పట్టించుకోని ఆ ప్రభుత్వ నాయకులకు కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదన్నారు. సీపీఎం, సీపీఐ, వైసీపీ పార్టీల కుట్రపూరిత విషయాన్ని కూటమి నాయకులు ప్రజలకు వివరించాలన్నారు.

'బాల్య వివాహాలను నిరోధించాలి'

పాడేరురూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో బాల్య వివాహాలను నిరోధానికి అందరూ సహకరించాలని స్థానిక ఐసీడీఎస్ సీడీపీవో పి.ఝాన్సీరాణి అన్నారు. శనివారం ఆమె పాడేరు గ్రామ సచివాలయం - 1లో కిశోర వికాస వేసవి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర వికాస వేసవి శిబిరాన్ని ఈ నెల 2వ తేదీ నుంచి జూన్ 10వ తేదీ వరకు నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసులు, సూపర్‌వైజర్లు, బాలికల తల్లులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో హిజ్రా మృతి

కొయ్యూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి డౌనూరు ప్రాథమిక వైద్య కేంద్రం ఆవరణలో అనకాపల్లి జిల్లా జోగంపేటలోని ఎస్సీ కాలనీకు చెందిన కుమారస్వామి అలియాస్ ఆకాంక్ష (25) అనే హిజ్రా అనుమానాస్పద రీతిలో మృతి చెందారు. శుక్రవారం అర్ధరాత్రి దాటాక ఈ ఘటన చోటు చేసుకుంది. శనివారం ఉదయం డ్యూటీలో ఉన్న సిబ్బంది గుర్తించారు. ఈ ఘటనపై స్థానికులు, సహ హిజ్రాలు, కుటుంబీకులు, పీహెచ్‌సీ సిబ్బంది అందించిన వివరాలివి.. జోగంపేటకు చెందిన పులి వెంకన్న, కొండమ్మ దంపతులకు చెందిన ఆకాంక్ష సుమారు ఎనిమిదేళ్ల కిందట నర్సీపట్నంకు చెందిన హిజ్రాల వద్దకు చేరారు. తరచూ మండలంలో డౌనూరు, మర్రిపాలెం గ్రామాలకు వచ్చి వ్యవసాయ పనుల్లో సాయం చేసి వచ్చిన డబ్బుతో మద్యం సేవించేది. గురువారం రాత్రి మర్రిపాలెంకు చెందిన కిముడు కొండమ్మ ఇంటికి వెళ్లింది. అ నంతరం జ్వరంగా ఉందంటూ అక్కడే నిద్రించింది. శుక్రవారం ఉదయం డౌనూరు పీహెచ్‌సీకు వెళ్లాలని సూచిస్తూ కొండమ్మ ఆమెకు రూ. 30 ఇచ్చింది. దీంతో మధ్యాహ్నం 12 గంటల సమయంలో కడుపు నొప్పికి వైద్య సేవలు పొందింది. అనంతరం కొండమ్మ ఇంటికి వెళ్లకుండా నాటుసారా సేవించి గ్రామంలో తిరిగినట్టు సమాచారం. అనంతరం అర్ధరాత్రి దాటాక సీహెచ్‌సీ ఆవరణలో సిమెంట్ బల్లపై మృతి చెందింది. దీంతో విషయాన్ని తెలుసుకున్న కొయ్యూరు సీఐ వెంకటరమణ, ఎస్‌ఐ కిశోర్‌వర్మ శనివారం ఉదయం సంఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి తోటి హిజ్రాలను, పీహెచ్‌సీ సిబ్బందిని విచారించారు. అనంతరం మృతుని అన్న దారబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి క్లూస్ టీంను రప్పించి పరిశీలించారు. మృతదేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలింప చేశారు. హిజ్రా ఆకాంక్ష మృతిపై అన్ని కోణాలలోనూ దర్యా ప్తు చేస్తున్నట్టు సీఐ వెంకటరమణ తెలిపారు.


దోనూరు పీహెచ్‌సీ ఆవరణలో ఆకాంక్ష మృతదేహం

మృతిపై అనుమానం ఉంది: మృతురాలి సోదరుడు దారబాబు

కుమారస్వామి అలియాస్ ఆకాంక్ష మృతిపై అన్న దారబాబు అనుమానం వ్యక్తం చేశారు ఎనిమిదేళ్ల క్రితం నుంచి పూర్తిగా హిజ్రాలతో కలసి వారంలో ఒక సారి ఇంటికి వచ్చేదన్నాడు. మూడు రోజుల క్రితం ఇంటికి వచ్చిందని అప్పుడు ఆరోగ్యంగానే ఉందన్నారు.ఇప్పుడు ఈ పరిస్థితిలో చూడటం అనువమానుమానాస్పందంగా ఉందని బోరున విలపించాడు.


విచారణ నిర్వహిస్తున్న సీఐ వెంకటరమణ

గిరిజనులను మభ్యపెడుతున్న వైసీపీ

- జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్


మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్

మహారాణిపేట (విశాఖపట్నం), మే 3 (ఆంధ్రజ్యోతి): జీవో నెంబరు 3 విషయంలో వైసీపీ నాయకులు గిరిజనులను మభ్యపెడుతున్నారని జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ ఆరోపించారు. శనివారం విశాఖలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వ వైఫల్యం కారణంగానే ఆ జీవో రద్దయ్యిందని, దీనిపై మాట్లాడే నైతిక హక్కు ఆ పార్టీ నాయకులకు లేదని అన్నారు. అసెంబ్లీకి వెళ్లి ఈ విషయమై వారు ఎందుకు మాట్లాడటం లేదని, ఆ పార్టీ ఎమ్మెల్యేలకు చిత్తశుద్ధి ఉంటే పదవులకు రాజీనామా చేసి పోరాటం చేయాలని సూచించారు. గత ఐదేళ్లలో డీఎస్సీ ఎందుకు నిర్వహించలేకపోయారని ప్రశ్నించారు. గిరిజనులకు ఇచ్చిన హామీలు నెరవేర్చటానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని శ్రావణ్‌కుమార్ అన్నారు.

అనంతగిరి: ఏజెన్సీలో శతశాతం ఉద్యోగాలు గిరిజనులకు వచ్చేలా జీవోలు తీసుకువచ్చింది.. టీడీపీ ప్రభుత్వమేనని జీసీసీ చైర్మెన్ కిడారి శ్రావణ్‌కుమార్ గుర్తుచేశారు. శనివారం స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జీవో 3 రద్దు చేస్తుంటే.. కనీసం ఆ పార్టీ ఎమ్మెల్యే నోరుమెదపలేదని, ఆరోపించారు.. కానీ ఇప్పుడు రాజకీయం లబ్ధికోసం రోడ్డెక్కి ఆందోళన చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి


సిఐ హిమగిరి.

అరకులోయ, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ రహదారి భద్రతపై అవగాహన పెంపొందించుకోవాలని తహసీల్దార్ ఎంవీఎస్ ప్రసాద్, సీఐ ఎల్.హిమగిరి అన్నారు. శనివారం ఓ రిసార్టు సమావేశమందిరంలో మోటారు, ఆటో యూనియన్ ప్రతినిధులు, కార్మికులతో రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ట్రాఫిక్ నిబంధనలను వాహనచోదకులు పాటించాలన్నారు. లైసెన్స్‌లు ఉండాలన్నారు. పర్యాటకులతో మోటారు, ఆటో యూనియన్ వాహనదారులు సామరస్యంగా మెలగాలన్నారు. స్థానిక ఎస్‌ఐ గోపాలరావు మాట్లాడుతూ అధిక సంఖ్యలో ఆటోలు, ఇతర వాహనాల్లో తీసుకువెళ్లరాదన్నారు. మోటారు, ఆటో యూనియన్ ప్రతినిధులు వారు ఎదుర్కొంటున్న పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ, హైవే, పంచాయతీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లంబసింగి టీడీపీ గ్రామ కమిటీ ఎన్నిక


నూతనంగా ఎన్నికైన లంబసింగి గ్రామ కమిటీ

చింతపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లంబసింగి పంచాయతీ టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా బోనంగి సోమలింగం పడాల్ ఎన్నికైనట్టు పార్టీ నాయకుడు కిముడు లక్ష్మయ్య తెలిపారు. శనివారం ఐటీడీపీ ఇన్‌చార్జి మహేంద్ర ఆధ్వర్యంలో గ్రామ కమిటీ సమావేశం జరిగింది. కార్యకర్తలు నూతన కమిటీని ఎన్నుకున్నారు. నాయకులు రామరాజు, వెంకటరమణ, కృష్ణవేణి, పార్వతి, బంగారయ్య, పోతురాజు పడాల్, బంగారుపడాల్, వీరయ్యదొర, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గర్భిణీలు ఆరోగ్య సూత్రాలు పాటించాలి

ముంచంగిపుట్టు, మే 3 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులు విధిగా ఆరోగ్య సూత్రాలు పాటించాలని కిలగాడ పీహెచ్‌సీ డాక్టర్ శిష అన్నారు. మండలంలో గల ఏనుగురాయి పంచాయతీ కేంద్రంలో శనివారం 104 వైద్య శిబిరం నిర్వహించారు. వివిధ వ్యాధులతో బాధపడుతున్న సుమారు 54 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో చౌడప్పడు, కిలగాడ వైద్య సిబ్బంది వేదవతి, అనిత, సత్తిబాబు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నీట్

... మొదటి పేజీ తరువాయి

ప్రిన్సిపాల్ కో-ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తారు. పరీక్షనిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా జిల్లా యంత్రాంగం పటిష్ఠ ఏర్పాట్లుచేసింది. ప్రతి రెండు కేంద్రాలకు ఒక తహసీల్దార్‌ను ఇన్‌చార్జిగా, ప్రతి ఎనిమిది కేంద్రాలకు ఒక ఆర్డీవోను పర్యవేక్షకునిగా నియమించారు. పరీక్ష నిర్వహణపై జిల్లా ఉన్నతాధికారులు శనివారం సాయంత్రం ఆర్డీవోలు, తహసీల్దార్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేస్తున్నారు. అభ్యర్థులు ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని నిర్వాహకులు కోరారు.

డిగ్రీ పరీక్షల షెడ్యూల్‌లో మార్పులు

... మొదటి పేజీ తరువాయి

ఈ నెల 21న ఉదయం, మధ్యాహ్నం నిర్వహించ నున్నారు. ఈ నెల ఏడో తేదీన ఉదయం, మధ్యాహ్నం జరగాల్సిన పరీక్షలను 22న అదే సమయాల్లో నిర్వహిస్తారు. అలాగే, ఈ నెల 19న ఉదయం, మధ్యాహ్నం జరగాల్సిన సెమి స్టర్ పరీక్షలను 23న, 20న ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం జరగాల్సిన రెండు, నాలుగో సెమిస్టర్‌కు సంబంధించిన మూడు పరీక్షలను 24న అదే సమయాల్లో నిర్వహించ నున్నట్టు అధికారులు వెల్లడించారు. ఏయూ అనుబంధ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులు, కాలేజీ యాజమాన్యాలు ఈ విషయాన్ని గుర్తిం చాలని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ టి.చిట్టి బాబు ఒక ప్రకటనలో కోరారు.

సర్వే రాళ్లపై పేరు తొలగింపు

... మొదటి పేజీ తరువాయి

గత ప్రభుత్వంలో జరిగిన తప్పులు సరిదిద్దడానికి గత ప్రభుత్వంలో జరిగిన రీ సర్వే మీద దృష్టి పెట్టింది. గ్రామ సభలు పెట్టి రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరించింది. తరువాత జిల్లాలో మిగిలిన 234 గ్రామాల్లో రీ సర్వే చేయాలని నిర్ణయించి జనవరి 20 నుంచి పనులు ప్రారంభించింది. అదే సందర్భంలో సర్వే రాళ్ల మీద పేర్లు తొలగించడానికి చర్యలు చేపట్టింది. గత ప్రభుత్వం 475 గ్రామాల్లో పాతిన 5,38,365 సర్వే రాళ్లకు గాను ఇప్పటికే 5,17,656 రాళ్ల మీద పేర్లు చెరిపేశారు. దీని కోసం రూ.80 లక్షలు ప్రభుత్వం ఖర్చు చేస్తున్నది.

రాళ్లపై పేర్లు తొలగించాల్సి మండలాలు ఇవే..

జిల్లాలో 24 మండలాలకు గాను 18 మండలాల్లో సర్వే రాళ్ల మీద పేర్లు చెరిపేశారు. ఇంకా రోలుగుంట మండలంలో 2,038, గొలుగొండ 4,303, కశింకోట 6,493, నాతవరం 4,052, మునగపాక 1,253, రాంబిల్లి 647.. మొత్తం 18,786 సర్వే రాళ్ల మీద పేర్లు చెరిపించాల్సి ఉంది.

నిండు ప్రాణాలు తీసిన నిర్లక్ష్యం

... మొదటి పేజీ తరువాయి

అక్కడి నుంచే పక్క మెట్ల మీదుగా మళ్లించారు. ఆ ప్రాంతంలో నిర్మించిన గోడే వర్షానికి కూలిపోయింది. కమిటీ విచారణలో ఇదే విషయం తేటతెల్లమైంది.

విధుల కేటాయింపులో వైఫల్యం

చందనోత్సవంలో సేవలు అందించానికి అటు అమలాపురం నుంచి ఇటు శ్రీకాకుళం వరకు ఉన్న ఆలయాల నుంచి వందలాది మందిని డిప్యుటేషన్‌పై సింహాచలం రప్పించారు. వారంతా చందనోత్సవానికి రెండు రోజుల ముందే ఇక్కడకు చేరుకున్నారు. అందరికీ డ్యూటీ పాయింట్లు వేశారు. అయితే అక్కడ ఎటువంటి విధులు నిర్వహించాలనే దానిపై ఎవరూ మార్గదర్శనం చేయలేదు. ఇలాంటి సందర్భాల్లో ఆలయ ఈఓ, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్, విజయవాడ కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన అధికారులు...ఓ సమావేశం ఏర్పాటు చేసి, ఆయా ఉద్యోగులకు ఎవరు ఏయే పనులు చేయాలో వివరించాలి. గతంలో అలాగే చేసేవారు. కానీ ఈసారి సమావేశం నిర్వహించలేదు. ఏ పనులు చేయాలో ఎవరికీ చెప్పలేదు. చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ తనకు బాధ్యతలు ఏమీ ఇవ్వలేదని కార్యాలయానికే పరిమితమయ్యారు. కమిషనర్, ఈఓలు ఇద్దరూ ఉత్సవం ముందురోజు ఎవరికీ అందుబాటులో లేరు. దాంతో డిప్యుటేషన్‌పై వచ్చిన వందలాది మంది ఉద్యోగులు వారికి కేటాయించిన ప్రాంతాల్లో దిష్టిబొమ్మల్లా నిల్చోవలసి వచ్చింది. ఇది కూడా ఓ వైఫల్యంగా కమిటీ దృష్టికి వచ్చింది. ఎటువంటి బాధ్యతలు అప్పగించనప్పుడు చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్‌ను ఎందుకు నియమిస్తున్నట్టు? అని కూడా ప్రశ్నించినట్టు సమాచారం.

ఎట్టకేలకు గచ్చపువీధి డ్రైనేజీ సమస్యకు పరిష్కారం



గచ్చపువీధిలో డ్రైనేజీ నిర్మాణం జరుగుతున్న దృశ్యం

నర్సీపట్నం, మే 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 26వ వార్డు గచ్చపువీధి డ్రైనేజీ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి చొరవతో ఇక్కడ డ్రైనేజీ పనులకు నిధులు మంజూరయ్యాయి. వీఆర్ఎండీ నుంచి రూ.26లక్షలతో 410 మీటర్లు పొడవు, రెండు అడుగులు వెడల్పుతో డ్రైనేజీ పనులు ప్రారంభమయ్యాయి. గచ్చపువీధిని ఆనుకొని ప్రాంతీయ ఆస్పత్రి ఉంది. ఆస్పత్రిలోని వ్యర్థాలు ఇక్కడ డ్రైనేజీ కాలువలో పడేసేవారు. ప్రజలు దుర్వాసన భరించలేక గత పదేళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వార్డు కౌన్సిలర్ పద్మావతి ఈ సమస్య పరిష్కారం కోసం గత నాలుగేళ్లుగా మునిసిపాలిటీ పాలకవర్గం దృష్టికి తీసుకు వస్తున్నారు. అయినా ఇక్కడ డ్రైనేజీ సమస్య పరిష్కారం కాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వీఎంఆర్‌డీ నిధులతో గచ్చపువీధిలో డ్రైనేజీ పనులు చేపట్టారు. దుర్వాసన బయటకు రాకుండా కాలువ మీద కాంక్రీట్ పలకలు అమర్చనున్నారు. ఏళ్ల తరబడి ఉన్న కాలువ సమస్య పరిష్కారం దొరికినందుకు వీధి ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

అల్లూరి పార్కులో మరిన్ని శిలాఫలకాలు

- సీతారామరాజు చరిత్ర తెలిపేలా సన్నాహాలు
- పది భారీ శిలాఫలకాలను అందజేసిన పోలీస్ అధికారి కరణం సత్యనారాయణ

కృష్ణాదేవిపేట, మే 3 (ఆంధ్రజ్యోతి) : గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలో గల అల్లూరి సీతారామ రాజు పార్కులో పర్యాటకులకు అల్లూరి జీవిత చరిత్ర తెలిసేలా శిలాఫలకాల ఏర్పాటుకు పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా పదిహేను రోజుల క్రితం పది భారీ శిలాఫలకాలను ఇక్కడికి తీసుకు వచ్చారు. వీటికి ఉమ్మడివిశాఖపట్నం అదనపు ఎస్పీగా పనిచేసిన కరణం సత్యనారాయణ ఆర్థిక సాయం అందించడంతో పాటు ఆయనే స్వయంగా శిలాఫలకాలను ఇచ్చి వెళ్లారు. పదేళ్ల క్రితం ఈ ప్రాంతంలో సీఐగా విధులు నిర్వహిస్తున్న సమయంలో ఆయన పార్కులో అల్లూరి చరిత్ర తెలిసేలా సుమారు 20 శిలాఫలకాలను ఏర్పాటు చేశారు. అల్లూరి చరిత్ర మరింత పూర్తిస్థాయిలో అందరికీ తెలియాలన్న సంకల్పంతో మరికొన్ని శిలాఫలకాలను ఏర్పాటు చేస్తున్నారు. వీటి ఏర్పాటు కోసం మూడు రోజులుగా ప్రహరీ పక్కన ఉన్న పిచ్చి తుప్పలను తొలగించడంతో పాటు గోడపై శిలాఫలకాలు అతికించేందుకు వీలుగా ఉపాధి కూలీలతో పనులు చేయిస్తున్నారు.



పార్కులో సిద్ధంగా ఉన్న శిలాఫలకాలు



ప్రహరీ గోడ వద్ద పనులు చేస్తున్న కూలీలు

ఈదురుగాలులతో వర్షం

కృష్ణాదేవిపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం ఏఎల్‌పురం, చోద్యం, సీహెచ్.నాగాపురం, కొంగసింగి, చోద్యం, పాతకృష్ణాదేవిపేట తదితర గ్రామాల్లో శనివారం ఈదురు గాలులతో వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండతో అల్లాడిన ప్రజలు వర్షంతో ఉపశమనం పొందారు. ఈ వర్షంతో గ్రామీణ రహదార్లు, వీధిరోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ముఖ్యంగా ఏఎల్‌పురం ఆర్టీసీ బస్ స్టేషన్ చెరువును తలపిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

నాతవరంలో..

మండల కేంద్రంలో శనివారం అర్థగంట సేపు కుండపోత వర్షం కురిసింది. ఈదురుగాలులతో వర్షం కురవడంతో ఉక్కపోతతో అల్లాడుతున్న జనాలకు ఈ వర్షం ఉపశమనం ఇచ్చింది. అలాగే చెరువులలో కాస్త నీరు చేరడంతో పశువులకు తాగునీరు దొరుకుతుందని రైతులు అంటున్నారు. అలాగే నువ్వు పంటకు ఉపయోగకరంగా ఉంటుందని వారంటున్నారు. వర్షానికి కొంతసేపు విద్యుత్ సరఫరా నిలిపివేశారు.



ఏఎల్‌పురం ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో పడుతున్న వర్షం

ఉపాధి పనులను ట్రాక్టర్‌తో దున్నిన ఇద్దరిపై కేసు

గొలుగొండ, మే 3(ఆంధ్రజ్యోతి): చెరువులో ఇటీవల నిర్వహించిన ఉపాధి పనులను ట్రాక్టర్‌తో దుక్కు చేయడంపై ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రామారావు తెలిపారు. ఎస్ఐ అందించిన వివరాలిలా వున్నాయి. మండలంలోని కొత్తఎల్లవరం రెవెన్యూలో పక్కుడి చెరువులో ఉపాధి పనులను కూలీలు చేశారు. ఈ పనులతో గట్టును పటిష్ఠం చేశారు. అయితే రాజపేట గ్రామానికి చెందిన కన్నూరి సత్యనారాయణ, నూకరాజు కలిసి శుక్రవారం అర్ధరాత్రి ట్రాక్టర్‌తో దుక్కు చేశారు. దీంతో తహసీల్దార్ శ్రీనివాసరావు చేసిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామారావు తెలిపారు.

12 గ్రామాల్లో రీ సర్వే పూర్తి : ఆర్డీవో



రైతులకు రీ సర్వే పత్రాలను అందజేస్తున్న ఆర్‌డీవో రమణ

మాకవరపాలెం, మే 3 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో 12 గ్రామాల్లో రీ సర్వే పూర్తయిందని నర్సీపట్నం ఆర్‌డీవో వీవీ.రమణ అన్నారు. శనివారం ఆయన లచ్చన్నపాలెం సచివాలయంలో సర్వే రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో పైలట్ ప్రాజెక్టుగా 12 గ్రామాల్లో రీసర్వే ప్రారంభించామన్నారు. ఇప్పటి వరకు 21,561 ఎకరాల్లో రీ సర్వే పూర్తిచేశామన్నారు. అలాగే లచ్చన్నపాలెం, పైడిపాల గ్రామాల్లో 3,506 ఎకరాల్లో రీసర్వే పూర్తి చేసి రైతులకు సర్వే రిపోర్టులను అందజేశారు. అలాగే సర్వేలో తప్పులు ఉంటే మళ్లీ సర్వే చేసి సరిచేస్తున్నామన్నారు. పూర్తి స్థాయిలో సర్వే చేసి రైతులకు పక్కాగా భూ రికార్డులను అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ లోకవరపు రామారావు, టీడీపీ నాయకులు పోతల రాంబాబు పాల్గొన్నారు.

హౌసింగ్ ఏఈ ప్రేమానందం బాధ్యతల స్వీకరణ

మాకవరపాలెం, మే 3 (ఆంధ్రజ్యోతి): మండల హౌసింగ్ ఏఈగా ప్రేమానందం శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో ఇక్కడ ఇందిరమ్మ పథకంలో హౌసింగ్ ఏఈగా పనిచేశారు. ఈయన నర్సీపట్నం రూరల్ హౌసింగ్ ఏఈగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా హౌసింగ్ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన సిబ్బందితో సమావేశమయ్యారు.

జూన్ 4న వైసీపీ శాంతి ర్యాలీ

- మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్



డీఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేశ్

నర్సీపట్నం, మే 3 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయనందుకు నిరసనగా జూన్ 4న పట్టణంలో శాంతియుత ర్యాలీ నిర్వహిస్తున్నట్టు మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ తెలిపారు. శనివారం ఈ ర్యాలీ నిర్వహించేందుకు అనుమతి కోసం డీఎస్పీ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల అమలు హామీతో అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు ప్రజలను మోసం చేశారన్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేసినప్పటికీ చంద్రబాబు ఇంకా ఎక్కువ ఇస్తాడని నమ్మి ప్రజలు ఓట్లు వేశారని అన్నారు. తల్లికి వందనం, నిరుద్యోగ భృతి, మహాశక్తి, ఉచిత బస్సు, ఫీజ్ రియింబర్స్‌మెంట్ పథకాలు అమలు చేయలేదని విమర్శించారు. దీనికి నిరసనగా సీబీఎం కాంపౌండ్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు.

సొత్తు కోసమే వృద్ధ దంపతుల హత్య

దువ్వాడ జంట హత్యల కేసులో వీడిన మిస్టరీ

విశాఖపట్నం, మే 3 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ సమీపాన గల రాజీవ్ కాలనీలో వారం కిందట జరిగిన వృద్ధ దంపతుల హత్య కేసుని పోలీసులు ఛేదించారు. మహిళ మెడలోని ఆభరణాలను దొంగిలించేందుకు ఆమెతో సన్నిహిత సంబంధం కలిగిన వ్యక్తే హత్యకు పాల్పడినట్టు నిర్ధారించారు. నిందితుడి నుంచి రెండు సెల్‌ఫోన్‌లు, రూ.4.18 లక్షల నగదు, హత్యకు వాడిని కత్తిని పోలీసులు స్వాధీనం చచేసుకున్నారు. నగర పోలీస్ కమిషనరేట్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో సీపీ శంఖబ్రతబాగ్చి దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు.

గంపల యోగేంద్రబాబు (66), ఆయన భార్య లక్ష్మి (58) కలిసి దువ్వాడలోని రాజీవ్‌కాలనీలో సొంత ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఒడిశా రాష్ట్రం పూరీకి చెందిన ప్రసన్నకుమార్‌మిశ్రా (58) కూడా వారి ఇంటికి సమీపంలోనే నివాసం ఉండేవాడు. పక్కపక్క ఇళ్లు కావడంతో ప్రసన్నకుమార్‌మిశ్రా భార్య, గంపల లక్ష్మి స్నేహంగా ఉండేవారు. కొవిడ్ సమయంలో ప్రసన్నకుమార్ మిశ్రా భార్య మరణించడంతో అతను ఇల్లు ఖాళీ చేసి ద్వారకా నగర్ ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని ఒక డార్మెటరీలో ఉంటున్నాడు. రాజీవ్ కాలనీలో ఉన్నప్పుడే ప్రసన్నకుమార్‌మిశ్రాకు గంపల లక్ష్మితో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఆ సంబంధం కొనసాగిస్తూ వచ్చారు. ప్రసన్నకుమార్ మిశ్రాకు ఆర్థిక ఇబ్బందుల కారణంగా అప్పులు చేసేశాడు. వాటిని తీర్చేందుకు ఆభరణాలు ఇవ్వాల్సిందిగా లక్ష్మిని కోరగా, ఆమె నిరాకరించింది. దీంతో ఆమెను చంపేసి ఆభరణాలను తీసుకువెళ్లాలని ప్రసన్నకుమార్‌మిశ్రా పథకం రచించాడు. గత నెల 24న గాజువాకలోని ఒక సూపర్‌మార్కెట్‌కు వెళ్లి కత్తి కొనుగోలుచేసి నేరుగా లక్ష్మి ఇంటికి వెళ్లాడు. బంగారం ఇవ్వాలని మరోసారి అడిగాడు. ఆమె ససేమిరా అనడంతో మెడను కత్తితో కోసి హత్య చేశాడు. ఆమె మెడలోని ఆభరణాలను తెంచుకుని వెళ్లిపోతుండగా, మరో గదిలో ఉన్న లక్ష్మి భర్త యోగేంద్రబాబు రావడంతో ఆయన్ను కూడా హత్యచేశాడు. అనంతరం యోగేంద్రబాబుకు చెందిన స్కూటీపై వెళ్లిపోయాడు. హత్య చేసిన తర్వాత డైమండ్ పార్కు సమీపంలోని సాయిరాం డార్మెటరీకి వెళ్లి రెండు గంటలు ఉన్నాడు. అక్కడి నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లి స్కూటీని పార్కింగ్‌లో వదిలేసి, విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో భువనేశ్వర్, అక్కడి నుంచి పూరీ వెళ్లిపోయాడు. చోరీచేసిన బంగారు ఆభరణాలను అక్కడ తన సోదరి చేతికి ఇచ్చి అమ్మి తనకు డబ్బులు తేవాలని కోరాడు. ఆమె బంగారం దుకాణానికి వెళ్లి ఆభరణాలను కరిగించి రూ.4.28 లక్షలకు విక్రయించింది. ఆ సొమ్మును తన సోదరుడైన ప్రసన్నకుమార్‌మిశ్రాకు ఇచ్చింది.

ఈ హత్య కేసు దర్యాప్తులో భాగంగా మృతురాలు లక్ష్మి సెల్‌ఫోన్‌ను పోలీసులు పరిశీలించారు. కాల్ డేటాను తీశారు. కొన్ని నంబర్లు ఆమె డిలీట్ చేసినట్టు గుర్తించారు. ఓ నంబర్ గల వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా, గతనెల 21న తాను దువ్వాడ మాక్స్ షోరూమ్ వద్ద ఉండగా సుమారు 56 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి వచ్చి కాగితంపై రాసుకున్న నంబర్‌కు తన ఫోన్ నుంచి కాల్ చేసినట్టు చెప్పారు. అక్కడవున్న సీసీ కెమెరాలను పరిశీలించగా ప్రసన్నకుమార్‌మిశ్రా ఫోన్ మాట్లాడినట్టు నమోదైంది. ఆ ఫొటోను దువ్వాడ ప్రాంతంలో పలువురికి చూపించగా ప్రసన్నకుమార్‌మిశ్రాగా, అతని స్వస్థలం ఒడిశా అని నిర్ధారించడంతోపాటు వారివద్ద ఉన్న ఫోన్ నంబర్‌ను ఇచ్చారు. ఆ ఫోన్ నంబర్ రాణిశర్మ అనే మహిళ పేరుతో ఉన్నట్టు గుర్తించారు. కాల్ చేస్తే స్విచ్ ఆఫ్ అని రావడంతో సీపీ శంఖబ్రతబాగ్చి ఆదేశాల మేరకు సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ ఆధ్వర్యంలో 15 మంది సీఐలు, వంద మంది సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఒడిశాలో ఉన్న ప్రసన్నకుమార్‌మిశ్రాను గుర్తించి అదుపులోకి తీసుకున్నాయి. మొదట తాను ఇద్దరినీ హత్య చేయలేదని చెప్పాడు. గంపల లక్ష్మికి తనతో వివాహేతర సంబంధం ఉందని తెలిసి ఆమె భర్త యోగేంద్రబాబు హత్య చేస్తే, తాను యోగేంద్రబాబును హత్య చేసినట్టు చెప్పాడు. తర్వాత పోలీసులు తమదైన శైలిలో విచారించడంతో సొత్తు కోసం లక్ష్మిని తాను హత్యచేసి వెళ్లిపోతుండగా యోగేంద్రబాబు చూడడంతో ఆయన్ను కూడా హత్యచేసినట్టు అంగీకరించాడు. నిందితుడు గతంలో యూఏఈలో ఉన్నప్పుడు చోరీకి పాల్పడి, ఐదేళ్లు జైలుశిక్ష అనుభవించాడని, విడుదలైన తర్వాత ఇండియాకు వచ్చి విశాఖలో నివాసం ఉంటున్నాడని సీపీ వివరించారు. ఈ సమావేశంలో డీసీపీలు అజితా వేజెండ్ల, మేరీప్రశాంతి, లతామాధురి, ఏసీపీలు త్రినాథరావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

పెదగోగాడ ఫీల్డ్ అసిస్టెంట్ తొలగింపు

చీడికాడ, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదగోగాడ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న భూసాల కనకాన్ని తాత్కాలికంగా తొలగిస్తూ ఉన్నతాధికారులనుంచి ఉత్తర్వులు జారీ అయినట్టు స్థానిక ఏపీవో అల్లు గంగునాయుడు శనివారం తెలిపారు. గ్రామంలో బండారు సూర్యనారాయణ, రమణమ్మ దంపతులు లేకుండా ఉపాధి పథకంలో 2020-21లో పండ్లతోటల పెంపకంలో 50 సెంట్ల భూమిలో 32 మొక్కలను ఉచితంగా ఇవ్వడమేకాకుండా మూడేళ్లపాటు మొక్కల సంరక్షణకు నగదును సైతం ఇచ్చారన్నారు. ఇవి నిర్ధారణ కావడంతో కనకాన్ని తొలగిస్తూ ఉత్తర్వులు జారీఅయ్యాయని ఏపీవో తెలిపారు.

డీసీఎంఎస్ చైర్మన్‌కు సన్మానం

చోడవరం, మే 3 (ఆంధ్రజ్యోతి): డీసీఎంఎస్ చైర్మన్‌గా నియమితులైన కోట్ని బాలాజీని శనివారం జిల్లా తెలుగుయువత నేతలు సన్మానించారు. తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు సిరిగిరిశెట్టి శ్రీరామమూర్తి, పృథ్వీ, ప్రదీప్,బుచ్చెయ్యపేట యాదవ సంఘం అధ్యక్షుడు సింగంపల్లి రమేశ్ బాలాజీనిఅనకాపల్లిలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కేజీబీవీ విద్యార్థినులకు కలెక్టర్ అభినందన



విద్యార్థినిని అభినందిస్తున్న కలెక్టర్

రావికమతం, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్నికం కస్తూర్బా విద్యాలయంలో ఈ ఏడాది టెన్త్, ఇంటర్ మీడియట్‌లలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులను కలక్టరు విజయకృష్ణన్ అభినందించారు. తన కార్యాలయంలో శుక్రవారం పదో తరగతి పరీక్షల్లో 568 మార్కులు తెచ్చుకున్న వర్షితలాస్య, 567 మార్కులు వచ్చిన ఇందుశ్రీ, ఇంటర్‌లో 969 మార్కులు సాధించిన టి. అశ్వినిలను అభినందించారు. ఈ కార్య క్రమంలో స్పెషలాఫీసర్ లెక్కల లలిత పాల్గొన్నారు.

రోలుగుంట: పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించడంలో ప్రత్యేక కృషి చేసిన స్థానిక కేజీబీవీ ఎస్ఓ తులసీని కలెక్టర్ విజయ్‌కృష్ణన్ ప్రత్యేకంగా సత్కరించారు. ఈ ఏడాది ఇంటర్ ఎంపీహెచ్‌డబ్ల్యూలో ఇంటర్ ఫలితాల్లో 33 మంది పరీక్షలు రాయగా, మొత్తం ఉత్తీరత సాధించారు. ఆర్.భావన 973/1000 మార్కులు సాధించారు. పదో తరగతి పరీక్షల్లో 31 మందిలో అందరూ ఉత్తీర్ణత సాధించారు.

నియోజకవర్గాల్లో సమస్యలపై పోరాటం

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్



మాట్లాడుతున్న గుడివాడ అమర్

చోడవరం, మే 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో స్థానిక సమస్యలపై త్వరలో పోరాటం చేపట్టనున్నట్టు వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, అనకాపల్లి జిల్లా పార్టీ విస్తృతస్థాయి సమావేశం ఈనెల 5న అనకాపల్లిలో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. బీ ఎన్ రోడ్డు దుస్థితి, గోవాడ షుగర్ ఫ్యాక్టరీ పరిస్థితిపై ప్రభుత్వం ఉదాసీనతను ప్రజల ముందు ఉంచుతామన్నారు. వెంకన్నపాలెం నుంచి చోడవరం వరకూ గల రోడ్డును మంత్రులు పరిశీలించాలన్నారు. గోవాడ షుగర్ ఫ్యాక్టరీకి కనీస నిధులు కేటాయించకపో శోచనీయమన్నారు. చోడవరం నియోజకవర్గంలో వనరుల దోపిడీ ఎక్కువగా సాగుతున్నదన్నారు.ఎంపీపీ గాడి కాసు, జట్పీటీసీ మాజీ సభ్యుడు బొడ్డేడ సూర్యనారాయణ, నాయకులు దొండా నారాయణమూర్తి, మడ్డు అప్పలనాయుడు, పుల్లేటి వెంకటరావు, బొడ్డు శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీరందించాలి: కలెక్టర్

బుచ్చెయ్యపేట మే3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జలజీవన్ మిషన్ పథకాలను పూర్తి చేసి ఇంటింటికీ తాగునీటి సరఫరా చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. మండలంలోని ఎల్‌బీ పురం, బంగారుమెట్ట గ్రామాల్లో కలెక్టర్ సుడిగాలి పర్యటన చేశారు. సందర్భంగా చెరువులో ఎన్ఆర్ఈజీఎస్ పనులు పరిశీలించారు. కూలీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కూలీలకు రూ. 300 కంటే వేతనం తక్కువ రావడం అసంతృప్తి వ్యక్తం చేశారు. నాణ్యతతో చెరువుపనులు చేపట్టాలని సూచించారు. అనంతరం శ్రీను అనే రైతునిర్మించిన నీటి గుంతను పరిశీలించారు. అక్కడ మొక్కలు నాటారు. పంచాయతీల్లో నీటికుంటల పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఏపీవో వరహలబాబును ఈ సందర్భంగా ఆదేశించారు, ఆనంతరం బంగారుమెట్టలో నిర్మించిన నీటి తొట్టెను ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా ఆవుకు నీటిని తాగించారు. రూ. 68లక్షలతో నిర్మిస్తున్న జలజీవన్ మిషన్ వాటర్ ట్యాంకును పరిశిలించారు. ఇంటింటికీ తాగు నీరు అందేలా ఏర్పాట్లు చేయాలని ఆర్‌డబ్ల్యూ అధికారులను ఆదేశించారు. ప్రతిరోజు ట్యాంక్‌లను క్లోరినేషన్ చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. చెత్త సేకరణకు వాహనాన్ని కొనుగోలు చేయాలని జడ్పీ సీఈవో రాజుకుమార్ ని ఆదేశించారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలపై కలెక్టర్‌కు వినతి పత్రాలు అందించారు. డ్వామా పీడీ పూర్ణిమాదేవి, ఏపీడీ శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రామస్వామి, మండల ప్రత్యేక అధికారి గోపాలకృష్ణ, ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దార్ ఎం. లక్ష్మి, ఏపీవో వరహలబాబు, మాజీ సర్పంచ్ తమరానదాసు, సర్పంచ్‌లు మెల్లి శ్రీను, మెరుగుకుమారి, ఎంపీటీసీ సభ్యులు యల్లపు జగ్గయ్యమ్మ, దొండా శ్రీను, సాయం శేషు, మండల అధికారులు నాయకులు, పాల్గొన్నారు. అనంతరం బుచ్చెయ్యపేట మండల కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధి పనులపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.



తొట్టెలో ఆవుకు నీరు పెడుతున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

పరిశుభ్రతతోనే ఆరోగ్యం: డీఎల్‌పీవో

దేవరాపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత, పరిసర పరిశుభ్రతతో ఆరోగ్యం సాధ్యమని డీఎల్‌డీవో మంజులావాణి అన్నారు. మండలంలోని మామిడిపల్లిలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. పశువుల హాస్పిటల్ ఆవరణలో పేరుకుపోయిన పిచ్చి మొక్కలను పంచాయతీసిబ్బందితో కలిసి తొలగించారు. ఎంపీడీఓ నసువర్ణరాజు, జడ్పీటీసీ సభ్యుడు కర్రిసత్యం, సర్పంచ్ కర్రి సూరినాయుడు, కో -ఆర్డినేటర్ త్రినాథ్, ఏఈఈలు చంద్రశేఖరు, తేజ, పశువైద్యాధికారి జి.ప్రియాంక, లెక్కల.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు గేదె, పెయ్యి మృతి

చీడికాడ, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో చినగోగాడ గ్రామంలో శనివారం సాయంత్రం పిడుగుపాటుకు పాడిగేదె, పెయ్యి మృతిచెందాయి. గ్రామానికి చెందిన కోనేటి సత్యనారాయణకు చెందిన పశువులపాకల వద్ద పిడుగుపడింది. ఆ ధాటికి పాడిగేదె, ఒక పెయ్యి అక్కడికక్కడే మృతిచెందాయి. సుమారు రూ.లక్ష వరకు నష్టం ఉంటుందని అంచనా వేశారు. సర్పంచ్ కొల్లి సూరినాయుడు రెవెన్యూ, పశుసంవర్ధకశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కోరారు.

నేడు కోనాంలో బోగొండమ్మ తల్లి పండగ



బోగొండమ్మ

చీడికాడ, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాం జలాశయం అనుకొని ఉన్న మెట్టపై వెలసిన బోగొండమ్మతల్లి పండగ ఆదివారం నిర్వహించనున్నారు. అమ్మవారు పరిసర ఏడు గ్రామాల ప్రజల పూజలు చేశారు.

మాడుగుల రూరల్: ఎం.కోడూరు గ్రామ దేవత మోదకొండమ్మ జాతర ఆదివారం ఘనంగా నిర్వహించనున్నారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు స్థానిక సర్పంచ్ , ఆలయ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి సంజీవరావు తెలిపారు.

ఘనంగా షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం

మాడుగుల, మే 3 (ఆంధ్రజ్యోతి) : స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయ 26వ వార్షికోత్సవ ంను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేకువజాము నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహించారు.

టీడీపీ గ్రామ కమిటీల ఎన్నిక

మాడుగుల రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ గ్రామ కమిటీల ఎన్నికలు శనివారం నిర్వహించారు. ఎం.కెవల్లాపురంలో అధ్యక్ష, ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా మజ్జి శ్రీను, నాయుడు, కోట్ని రామాంజనేయులు, ఎం.కోటపాడులో గంగునాయుడు, రాము, గాదిరాయిలో అధ్యక్షుడిగా అనపగడ్డి అప్పారావులను సభ్యులు ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, మాజీ సీడీసీ చైర్మన్ మజ్జితాతబాబు, టీడీపీ మండల అధ్యక్షులు అద్దిపల్లి జగ్గారావు, తదితరులు పాల్గొన్నారు.

మాడుగులలో భారీ వర్షం

- నేలకొరిగినచెట్లు, విద్యుత్ స్తంభాలు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాడుగుల, మే 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలో శనివారం ఈదురుగాలులతో పాటు వర్షం కురిసింది. మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎండ కాసింది. తర్వాత ఈదురు గాలులతో వర్షం కురిసింది. మాడుగుల మోదకొండమ్మ అమ్మవారి ఆలయానికి వెళ్లే పాటు, విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంతో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఘాట్‌రోడ్డు నుంచి గరికిబంద వరకు రోడ్డుకి అడ్డంగా చెట్టుకొమ్మలు విరిగి పడ్డాయి. రాకపోకలకు అంతరాయం నెలకొంది. అరటి తోటలు నేలకొరిగాయి. మామిడికాయలు నేలరాలాయి. అయితే, రాత్రి ఏడున్నర గంటల వరకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించలేదు.

మాడుగుల రూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఈదురు గాలులతో వర్షం పడింది. మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత ఈదురు గాలులతో గంటసేపు వర్షం కురిసింది. గాలులకు కేజేపురం, వీరవిల్లి అగ్రహారం, ఘాట్‌రోడ్డు జంక్షన్, ఎం.కోడూరు గ్రామాల వద్ద విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పలు చోట్ల చెట్ల కొమ్మలు విరిగాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం నెలకొంది.

చోడవరం: మండలంలో శనివారం సాయం త్రం వర్షం కురిసింది. ఈ వర్షంతో జనాలకు ఉపశమనం లభించినట్లయింది.